విశాఖపట్టణం
బుధవారం 29 జులై 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:186 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## రిజర్వేషన్ హటావో ఆందోళన్

సీజేపీ, ఈ 20 తరహాలో మరో ఉద్యమం

కొద్దిరోజుల్లోనే ఇన్ స్టాలో 5.5 మిలియన్ల ఫాలోవర్లు




2

## 7 వేలకు పైగా స్టూడెంట్స్‌కు హెచ్ఐవీ

విద్యార్థుల్లో పెరుగుతున్న హెచ్ఐవీ కేసులు,

ఇక అన్ని కాలేజీల్లో తప్పనిసరి క్యాంపులు

ప్రభుత్వం ఎమర్జెన్సీ చర్యలు

హెచ్ఐవిలో మూడో స్థానంలో కర్ణాటక

# గిరి ప్రదక్షిణం.. జయప్రదం

### లక్షలాదిగా దర్శించుకున్న భక్తులు.... రథయాత్ర ప్రారంభించిన అశోక్ గజపతి



(విశాఖపట్నం - జయజయహే)

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు సింహాచలం శ్రీవరాహ లక్ష్మీ నరసింహ స్వామి గిరిప్రదక్షిణ అత్యంత వైభవంగా సాగుతోంది. ఉత్తరాంధ్రతో పాటుగా ఇతర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు గిరిప్రదక్షిణకు హాజరయ్యారు. 32 కిలోమీటర్ల మేర భక్తులు ప్రదక్షిణ మహోత్సవంలా సాగింది. ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు దంపతులు ఆలయంలో శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన గవర్నర్ దంపతులకు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) జల్లేపల్లి వెంకట్రావు, ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేద మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.







అనంతరం గవర్నర్ దంపతులు స్వామివారి సేవలో పాల్గొని తీర్థప్రసాదాలు, వేదాశీర్వచనం స్వీకరించారు. దర్శనానంతరం, భక్తుల జయజయధ్వానాలు, కోలాహలం నడుమ స్వామివారి రథోత్సవాన్ని ఆలయ ధర్మకర్త, ఆలయ అధికారులు జెండా ఊపి వైభవంగా ప్రారంభించారు. ఈ రథం భక్తుల కోలాహలం నడుమ తొలి పావంచనుండి ఆదివారం కొత్త గోసాల, ఆరిలోవ, హనుమంతువాక, మద్దులపాలెం, గురుద్వారా జంక్షన్ , అక్కయ్యపాలెం, ఎన్ఏడి జంక్షన్ గోపాలపట్నం మీదుగా రథం ప్రయాణం సాగుతుందని భక్తులు వారి మొక్కలు చెల్లించుకోవచ్చని తెలిపారు. ఈ రథం ముందు భాగాన కోలాటాలు పులి వేషాలు,చెక్కభజనలు భక్తుల గోవింద నామ స్వరములతో కోలహాలంగా ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమంలో రథంతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్రానికి జెనోమిక్

## సొల్యూషన్ సెంటర్

ఏర్పాటు చేయనున్న అస్ట్రాజెనెకా

ఫార్మా, బయో రంగాల్లో ప్రభుత్వంతో కలిసి పరిశోధనలు

సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంఓయూలు

(అమరావతి - జయజయహే)

రాష్ట్రంలో క్యాన్సర్ రంగంలో జన్యుపరమైన పరిశోధనల ద్వారా వైద్య చికిత్సలను అందించేందుకు వీలుగా కీలకమైన ముందడుగు పడింది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానాన్ని ప్రారంభించేందుకు వీలుగా అంతర్జాతీయ ఫార్మాసుటికల్, బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ ఆస్ట్రాజెనెకా ఇండియా ప్రభుత్వం మధ్య సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంది. రిలయన్స్‌కు చెందిన స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూఆర్ఏఐ సంస్థలతో కలిసి ఆస్ట్రా జెనెకా ఇండియా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. అమరావతి క్వాంటం వ్యాలీ-ఆస్ట్రా జెనెకా ఇండియా భాగస్వామ్యంతో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించనున్నారు. ఊపిరితిత్తులు, రొమ్ము క్యాన్సర్ రోగుల కోసం ..మిగతా 2లో

# డిఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లపై కదంతొక్కిన వైఎస్సార్ సీపీ

మంత్రి నారా లోకేశ్ పదవికి రాజీనామా చేయాలి - రోజా

అక్రమాలపై చర్చకు నేను రెడీ.. - పేర్ని నానీ సవాల్

(అమరావతి - జయజయహే)

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పరీక్షల నిర్వహణలో భారీ స్థాయిలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది. ఇందులో భాగంగా తిరుపతిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన ర్యాలీలో మాజీ మంత్రి ఆర్.కే. రోజా పాల్గొని




విద్యాశాఖకు నేతృత్వం వహిస్తున్న మంత్రి నారా లోకేష్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల నుండి ఫలితాలు, మెరిట్ జాబితాల ప్రకటన వరకు ప్రతి దశలోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని, వీటన్నింటికీ నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు డిమాండ్ చేశాయి. తిరుపతి ర్యాలీ అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి రోజా మాట్లాడారు. లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థుల భవిష్యత్తుతో కూటమి ప్రభుత్వం ఆడుకుంటోందని విమర్శించారు. పారదర్శకంగా జరగాల్సిన డీఎస్సీ ప్రక్రియలో కట్ ఆఫ్ మార్కులు, మెరిట్ జాబితాల విడుదలపై తీవ్ర గందరగోళం సృష్టించారని, అర్హులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. కేవలం ప్రకటనలకే పరిమితమైన మెగా డీఎస్సీ వెనుక భారీ కుంభకోణం ..మిగతా 2లో



## 40 శాతం మేర లోటు వర్షపాతం

జులై నెలలోనే 69 శాతం నమోదు

రాబోయే మూడు నెలల్లో మరింత తీవ్రం

ఎల్ నినో ప్రభావంపై చంద్రబాబుకు నివేదన

రైతులకు అవగాహన కలిగించాలని ఆదేశం

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని సూచన

(అమరావతి - జయజయహే)

రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు, రైతుల్లో కల్పించాల్సిన అవగాహనపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు వ్యవసాయ, ఉద్యాన, హార్టికల్చర్, పశుసంవర్ధక, ఇరిగేషన్ శాఖల అధికారులు హాజరయ్యారు. వ్యవసాయ శాఖ మంత్రి ..మిగతా 2లో



## పార్టీకి కట్టుబడి ఉంటా..!

ఇకపై పార్టీ జాగ్రత్తలు తీసుకుంటా

త్రిసభ్య కమిటీ ముందు బొండా ఉమా వివరణ

పార్టీ లైన్‌ని దాటరాదని అధిష్టానం హెచ్చరిక

(అమరావతి - జయజయహే)

విజయవాడ సెంట్రల్ టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ఇటీవల వైసీపీ నేత అంబటి రాంబాబుతో భేటీ కావడంపై చెలరేగిన రాజకీయ వివాదం నడుమ ఆయన కీలక వివరణ ఇచ్చారు. అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన టీడీపీ త్రిసభ్య కమిటీ ముందు హాజరైన బోండా ఉమ, తన వైఖరిని స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ పార్టీ లైన్‌ను దాటలేదని, భవిష్యత్తులో కూడా దాటే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. చంద్రబాబు ఆదేశాలను శిరసావహిస్తానని, అనవసరంగా ఈ విషయాన్ని వివాదాస్పదం చేశారని ఆయన పేర్కొన్నారు. కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభకు వెళ్లిన సమయంలో అక్కడ వైఎస్సార్‌సీపీ ..మిగతా 2లో

ప్రారంభోత్సవ పనులు

## త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రధాని పర్యటన సమన్వయంతో వియవంతం కావాలి

భోగాపురంలో ఎయిర్ పోర్టుపై మంత్రి లోకేష్ సమీక్ష

(భోగాపురం - జయజయహే)

విజయనగరం జిల్లా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రధాని పర్యటన విజయవంతానికి ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఆగష్టు 1వ తేదీన రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై భోగాపురం విమానాశ్రయంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కే.రామ్మోహన్ నాయుడుతో కలిసి అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ..మిగతా 2లో



## అరెస్టు నుంచి రక్షణ కల్పించలేం

మధ్యంతర బెయిల్ ఇవ్వలేం

తమ్మినేని కుమారుడు శ్రీరామ చిరంజీవికి ఎదురుదెబ్బ

తమ్మినేని, ఆయన భార్యకు హైకోర్టు ఊరట

తాత్కాలిక మధ్యంతర బెయిల్ మంజూరు

2

## మెటా, ఇన్ స్టాలకు కేంద్రం సమన్లు



ఫేస్ బుక్ లో ప్రధాని మోడీ పోస్టు తొలగింపు

ఏ ప్రాతిపదికన రిమూవ్ చేసారో తెలపాలని నోటీసులు

సాంకేతిక పొరపాటుగా క్షమాపణలు చెప్పిన మెటా

2

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్టు

మిర్యాలగూడలో అదుపులోకి

ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక పరారీలో

హైకోర్టులో క్యాష్ విచారణకు ప్రాధాన్యత



For a pure tomorrow..
జయహో

# రిజర్వేషన్ హటావో ఆందోళన్

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

కాక్రోచ్ జనతా పార్టీ డిజిటల్ వేదికగా పెద్ద ఎత్తున ఆందోళన చేసిన తదనంతర పరిణామాల్లో ఇప్పుడు సోషల్ మీడియాలో మరో తీవ్రమైన అంశంపై ప్రచారం వేగంగా విస్తరిస్తోంది. 'రిజర్వేషన్ హటావో ఆందోళన్' పేరుతో కొద్దిరోజుల క్రితం ప్రారంభమైన ఒక ఇన్స్టాగ్రామ్ ఖాతా ఏకంగా 55 లక్షల (5.5 మిలియన్లు) ఫాలోవర్ల మార్కును దాటేసింది. తీవంవతీజుఖ్అశీఅష్ఘ్శుశీఎశీజవఎవత్ అనే ఐడీతో నడుస్తున్న ఈ ఖాతాలో ఇప్పటివరకు 100కు పైగా పోస్టులను ఉంచారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఈ ఖాతా కేవలం భారత సైన్యం అధికారిక ఖాతాను మాత్రమే ఫాలో అవుతోంది. తమకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదని, ఇది పూర్తిగా పౌరుల మద్దతుతో సాగుతున్న స్వచ్ఛంద ఉద్యమమని ఖాతా నిర్వాహకులు ప్రకటించారు. అయితే ఈ ఉద్యమం వెనుక ఉన్న ముఖ్య సూత్రధారి ఎవరనేది ఇప్పటివరకు వెల్లడి కాలేదు.

**'ప్రతిభకే ప్రాధాన్యం' - డిమాండ్లు ఏంటి?**

బి.ఆర్. అంబేద్కర్ ఇచ్చిన "చదువుకో-పోరాడు-సమకూరు" పిలుపుతో పాటు "కులాలు వేరైనా మనుషులంతా ఒక్కటే, దేశ ప్రగతియే మా లక్ష్యం" అనే అర్థం వచ్చేలా ఉన్న వ్యాక్యాన్ని ప్రొఫైల్ వివరాల్లో చేర్చారు. రిజర్వేషన్ల వ్యవస్థ వల్ల ప్రతిభ తీవ్రంగా దెబ్బతింటోందని, సమాజంలో కుల వ్యత్యాసాలు మరింత పెరుగుతున్నాయని ఈ గ్రూప్ వాదిస్తోంది. పోటీతత్వం తగ్గడం వల్ల విద్యా ప్రమాణాల నాణ్యత పడిపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తూ, కులానికి బదులుగా కేవలం ప్రతిభ ఆధారంగానే సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తోంది. సమాజంలో కుల వివక్షను పూర్తిగా రూపుమాపడమే ప్రభుత్వ లక్ష్యమైతే, రోజువారీ అధికారిక లావాదేవీలలోనూ లేదా ప్రభుత్వ ప్రక్రియలలోనూ కుల గుర్తింపును అడగడం, గుర్తించడం తక్షణమే నిలిపివేయాలని ఉద్యమ నిర్వాహకులు తమ ప్రణాళికలో స్పష్టం చేశారు. ఇటీవల అభిజీత్ దిప్కే నేతృత్వంలో వ్యంగ్యాత్మకంగా ప్రారంభమైన 'కాక్రోచ్ జనతా పార్టీ' దేశవ్యాప్తంగా పెద్ద సంచలనమే సృష్టించింది. వివిధ పోటీ పరీక్షల్లో అక్రమాలపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద యువత చేపట్టిన నిరసనలకు ఈ డిజిటల్ ఉద్యమమే వేదికగా నిలిచింది. ఆ నిరసనల పరిణామాల క్రమంలోనే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

అదే తరహాలో 'ఈ 20 జనతా పార్టీ' పేరిట మరో ఖాతా కూడా సోషల్ మీడియాలో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పర్యవేక్షణలో అమలవుతున్న 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈ ఖాతా ప్రచారం నిర్వహిస్తోంది. ముడిచమురు దిగుమతుల భారాన్ని తగ్గించడం, వాహన ఉద్గారాలను అదుపు చేయడం, చెరకు, జొన్న రైతులకు మెరుగైన ఆదాయం అందించడమే ఈ 20 లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. అయితే పాత వాహనాలు ఈ ఇంధనానికి అనుకూలంగా ఉండవని, ఇంజిన్ మైలేజ్ తగ్గడంతో పాటు ఇథనాల్ తయారీకి ఎక్కువ నీటి వినియోగం అవసరమవుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్టు

### మిర్యాలగూడలో అదుపులోకి ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక పరారీలో

### హైకోర్టులో క్యాష్ విచారణకు ప్రాధాన్యత

**(హైదరాబాద్ - జయజయహే)**

తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో కీలక ట్విస్ట్ చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిన ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. దీంతో మరోసారి ఈ కేసు రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్ట్ నేపథ్యంలో ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో జరగనున్న విచారణ ప్రాధాన్యత సంతరించుకుంది. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉదయ్ కృష్ణారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. ఆ తర్వాత ఆయన అందుబాటులో లేకుండా పోవడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయ్ కృష్ణారెడ్డిని త్వరలో అరెస్ట్ చేస్తామని హైదరాబాద్ పోలీసులు ప్రకటించారు. ఆయన కోసం హైదరాబాద్‌తో పాటు ఒంగోలు ప్రాంతాల్లో కూడా పోలీసులు ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించారు. పోలీసుల గాలింపు చర్యల అనంతరం మంగళవారం జులై 28న మిర్యాలగూడలో ఉదయ్ కృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన్ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. హైదరాబాద్ నేషనల్ పోలీస్ అకాడమీ లో శిక్షణ పొందుతున్న ఓ లేడీ ట్రైనీ ఐపీఎస్ అధికారిని ఉదయ్ కృష్ణారెడ్డి వేధించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై కేసు నమోదు కాగా, దర్యాప్తు కొనసాగుతోంది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఉదయ్ కృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన క్వాష్ పిటిషన్‌పై విచారణ జరగనున్న సమయంలోనే అరెస్ట్ కావడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం పోలీసులు కేసుకు సంబంధించిన తదుపరి చర్యలు చేపడుతున్నారు. ఈ వ్యవహారంలో కోర్టు నిర్ణయం, దర్యాప్తు పురోగతిపై రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తి నెలకొంది.

## రాష్ట్రానికి జెనోమిక్ సొల్యూషన్ సెంటర్

మొదటి పేజీ తరువాయి...

అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ చేసేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్ సెంటర్‌ను ఆస్ట్రా జెనెకా ఏర్పాటు చేయనుంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్, ఆధునిక జన్యుచికిత్సా విధానాల్ని వినియోగించి క్యాన్సర్ ప్రారంభదశలోనే గుర్తించి శరీర తత్వానికి అనుగుణంగా చికిత్స అందించేలా ఈ ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానం ఉపకరించనుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ముందుగా గుర్తించేందుకు ఏఐతో కూడిన ఎక్స్‌రే ఆధారిత వ్యవస్థను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేస్తారు. తద్వారా రోగులకు వేగంగా స్క్రీనింగ్, డయాగ్నోస్టిక్ సేవలు అందటంతో పాటు ఎలాంటి జాప్యం లేకుండా చికిత్స చేసేందుకు వీలుగా మార్గం సుగమం కానుంది. ప్రజలందరికీ అందుబాటులో అత్యాధునిక వైద్య సదుపాయాలను తీసుకురావటమే ఈ ఒప్పందం లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఫార్మా, బయో టెక్నాలజీ రంగాల్లో క్వాంటం పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. కాలుష్యం లాంటి బాహ్య కారణాల వల్ల కూడా ప్రమాదకరమైన క్యాన్సర్ బారిన పడుతున్నారని ముందే గుర్తించి చికిత్సలు అందించటం ద్వారా రోగులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. వైద్య రంగంలోని వ్యవస్థలు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని ప్రతీ పౌరుడి హెల్త్ ప్రొఫైల్స్‌ను డిజిటల్ రికార్డులుగా మారుస్తున్నామని తెలిపారు. క్యాన్సర్‌తో పాటు ఇతర వ్యాధులపై కూడా అమరావతి క్వాంటం వ్యాలీ నుంచి విస్తృతంగా పరిశోధనలు జరగాలని అన్నారు. కార్యక్రమంలో ఆస్ట్రాజెనెకా ఇండియా ఎండీ ఎ. ప్రవీణ్‌రావు, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థల ప్రతినిధులు, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అరెస్టు నుంచి రక్షణ కల్పించలేం

**(విజయవాడ - జయజయహే)**



ఫోర్జరీ పత్రాలు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న కేసులో వైఎస్సార్సీపీ నేత తమ్మినేని సీతారాం కుమారుడు వెంకట శ్రీరామ్ చిరంజీవి నాగ్‌కి హైకోర్టులో చుక్కెదురైంది. ఆయనకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించలేమని కోర్టు స్పష్టం చేసింది. సొంత సొమ్ముతో ప్లాట్లు కొన్నారని నిరూపించడంలో ఆయన విఫలమయ్యారని పేర్కొంది. మధ్యంతర ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరిస్తూ ఆయన వేసిన అనుబంధ పిటీషన్‌ను కొట్టివేసింది. కేసులో తమ్మినేని సీతారాం, ఆయన భార్య వాణికి తాత్కాలిక మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం విచారణాధికారి ముందు హాజరు కావాలని తమ్మినేని సీతారాంను ఆదేశించింది. హైకోర్టులో ఎదురుదెబ్బ: భూయజమాని బతికి ఉండగానే మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించడం, కోట్లు విలువైన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యవహారంపై నమోదైన కేసులో తమ్మినేని సీతారాం తనయుడు నాగ్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని మధ్యంతర ముందస్తు బెయిలివ్వాలని నాగ్ చేసిన అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఆయన దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టేసింది. ఇదే కేసులోఏ-6గా ఉన్న తమ్మినేని సీతారాం, ఏ-7 గా ఉన్న ఆయన సతీమణి వాణికి తాత్కాలిక మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తదుపరి విచారణ వరకూ వీరిద్దరినీ అరెస్ట్ చేయొద్దని దర్యాప్తు అధికారికి సూచించింది. మరోవైపు ఈ నెల 29న ఉదయం 10 గంటలకు ఐవో ముందు హాజరుకావాలని తమ్మినేని సీతారాంను ఆదేశించింది. దర్యాప్తు అధికారి కోరినప్పుడు విచారణకు హాజరవుతూనే ఉండాలని తేల్చిచెప్పింది. దర్యాప్తునకు సహకరించకపోతే మధ్యంతర ముందస్తు బెయిల్ రద్దు చేస్తామని హెచ్చరించింది. వాణి విచారణ విషయంలో చట్ట నిబంధనలను పాటించాలని ఐవోకు సూచించింది. ప్రధాన బెయిల్ పిటిషన్‌పై విచారణ ఆగస్టు 17కి వాయిదా వేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చారు.

## మెటా, ఇన్ స్టాలకు కేంద్రం సమన్లు

### ఫేస్ బుక్ లో ప్రధాని మోడీ పోస్టు తొలగింపు

### ఏ ప్రాతిపదికన రిమూవ్ చేసారో తెలపాలని నోటీసులు

### సాంకేతిక పొరపాటుగా క్షమాపణలు చెప్పిన మెటా

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేసిన ఒక వీడియోను మెటా సంస్థ తొలగించడం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ అనూహ్య చర్యపై కేంద్ర సమాచార ప్రసార, సాంకేతిక మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. అసలు ఏ ప్రాతిపదికన ప్రధాని పోస్ట్‌ను తొలగించారో స్పష్టత ఇవ్వాలంటూ మెటా ప్రతినిధులకు అత్యవసర సమన్లు జారీ చేసింది. కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనల నేపథ్యంలో ఫేస్‌బుక్ సహా.. అన్ని ప్లాట్‌ఫాంలలో ప్రధాని మోదీ యువతను ఉద్దేశించచి ఓ సందేశాన్ని పంచుకున్నారు. ఈ సందేశానికి సంబంధించిన వీడియోని ఫేస్‌బుక్ లో మెటా బ్లాక్ చేసింది. ఫేస్‌బుక్ (మెటా) చర్యపై కేంద్ర ప్రసారశాఖ ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి చేసిన ఫేస్‌బుక్ పోస్ట్‌ను సోషల్ మీడియా సంస్థ మెటా తొలగించిన తర్వాత, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆ సంస్థ గ్లోబల్ హెడ్ ఆఫ్ పబ్లిక్ పాలసీని పిలిపించిందని వర్గాలు మంగళవారం తెలిపాయి. అంతేకాకుండా సమన్లు జారీ చేసినట్లు పేర్కొన్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల నియంత్రణ, పారదర్శకత లేకపోవడంపై ఐటీ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతకుముందు ప్రధాని మోదీ వీడియో బ్లాక్ పై స్పందించిన మెటా.. ప్రధాని మోదీకి క్షమాపణలు చెప్పింది. దీంతో పాటు.. బ్లాక్ చేయడం సాంకేతిక పొరపాటేనని పేర్కొంది. వీడియోను పునరుద్ధరించామని మెటా ప్రతినిధి ప్రకటించారు. కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన విద్యార్థుల నిరసనల మధ్య జూలై 23న పోస్ట్ చేసిన ఈ వీడియో పరీక్షా పేపర్ 'లీకుల'పై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ ప్రధాని మోదీ యువతను ఉద్దేశించి మాట్లాడారు. పరీక్షల పేపర్ లీకేజీలు, కఠిన చట్టాల అంశంపై ప్రధాని మోదీ ఇన్స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ భారీ స్థాయిలో వ్యూస్ సాధించి రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే.. ఈ క్రమంలోనే.. ఈ వీడియో బ్లాక్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

## పార్టీకి కట్టుబడి ఉంటా..!

మొదటి పేజీ తరువాయి...

నేతలను కలవాల్సి వచ్చిందని బోండా ఉమ కమిటీకి వివరించారు. అంబటి రాంబాబుతో తనకు దాదాపు మూడు దశాబ్దాలుగా వ్యక్తిగత పరిచయం ఉందని, ఆ క్రమంలోనే ఆయన తన వద్దకు వచ్చి పలకరించారని తెలిపారు. తాము కేవలం కాపు సామాజికవర్గ సమస్యలపైనే సాధారణంగా మాట్లాడుకున్నామని, అంతకుమించి ఎటువంటి రాజకీయ చర్చలు జరగలేదని వివరణ ఇచ్చారు. అయితే, కొందరు దుష్టశక్తులు ఈ చిన్న విషయాన్ని విపరీతంగా ట్రోల్ చేస్తూ సోషల్ మీడియాలో తన మాటలను వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో క్రమశిక్షణే ప్రాధాన్యమని పేర్కొన్న బోండా ఉమ, ఎవరైనా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. తాను దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీకి కట్టుబడి ఉన్నానని, ఎప్పుడూ ఎలాంటి తప్పు చేయలేదని, మున్ముందు కూడా చేయబోనని చెప్పుకొచ్చారు. ముద్రగడ సభ వద్ద జరిగిన సంఘటన అనుకోకుండా జరిగిందని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటానని త్రిసభ్య కమిటీకి హామీ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతలతో సొంత పార్టీ నాయకులు సఖ్యతగా కనిపిస్తే క్యాడర్‌కు తప్పు సంకేతాలు వెళ్తాయని అధిష్టానం తీవ్రంగా పరిగణించింది. ఈ కారణంగానే బోండా ఉమను వివరణ కోరడం, ఆయన త్రిసభ్య కమిటీ ముందుకు వచ్చి వివరణ ఇచ్చారు. గతంలో అంబటితో భేటీపై కాస్త ఘాటుగానే స్పందించిన బోండా ఉమ, కమిటీ ముందు మాత్రం పూర్తిగా తగ్గి వ్యాఖ్యానించడంపై పార్టీ శ్రేణుల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అధిష్టానం కఠిన వైఖరి వల్లే ఆయన ఈ రకంగా యూటర్న్ తీసుకున్నారనే టాక్ వినిపిస్తోంది. ఏపీ రాజకీయాల్లో ప్రత్యర్థి పార్టీల నేతలతో వేదికలు పంచుకోవడంపై కఠినంగా ఉండాలని నిర్ణయించిన టీడీపీ అధిష్టానానికి బోండా ఉమ ఇచ్చిన వివరణతో ఈ వివాదానికి తాత్కాలికంగా తెరపడినట్లే కనిపిస్తోంది. త్రిసభ్య కమిటీ తన నివేదికను పార్టీ అధినేత చంద్రబాబుకు సమర్పించనుంది.

## 40 శాతం మేర లోటు వర్షపాతం

మొదటి పేజీ తరువాయి...

అచ్చెన్నాయుడు జూమ్‌లో పాల్గొన్నారు. జులై నెలలో 69 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు చంద్రబాబుకు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో సరాసరి 35 శాతం నుంచి 40 శాతం మేర లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. జూన్--నవంబర్ మధ్య 844 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 551 మిల్లీ మీటర్లు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతుందని చంద్రబాబు దృష్టికి వారు తీసుకెళ్లారు. ఈ క్రమంలో చంద్రబాబు కృష్ణా, గోదావరి బేసిన్లలో ఎగువ రాష్ట్రాల నుంచి జలాలు వచ్చే అవకాశంపై అధికారులను ఆరా తీశారు. అన్ని జిల్లాల్లోనూ ఎల్‌నినో ప్రభావం చూపిస్తోందని అధికారులు, ముఖ్యమంత్రికి వివరించారు. ఇందులో ఎక్కువగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, వైఎస్సార్ కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయని తెలిపారు. 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07 లక్షల హెక్టార్లలో వరిపై ప్రభావం చూపిస్తుందన్నారు. శ్రీకాకుళం జిల్లా పరిధిలోనే వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులు, చంద్రబాబుకు వివరించారు. ఈ క్రమంలో స్పందించిన ముఖ్యమంత్రి వంశధార నుంచి జలాలు తరలించి పంటలను కాపాడేలా ప్రయత్నించాలని సూచించారు. రాష్ట్రంలో 122 హై రిస్క్ మండలాలను గుర్తించామని అధికారులు చెప్పగా, ఆ మండలాల్లో బోరు ఆధారంగా పంటలను కాపాడుకునే అంశాన్ని పరిశీలించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆగస్టు 3 నుంచి అవగాహన కార్యక్రమాలు, వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి, అత్యవసర విత్తన ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు చంద్రబాబుకు తెలిపారు. ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద ఈ నెల 31 వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. వరి పంటకు ఆగస్టు 15 వరకు సమయం ఉందని, పశు గ్రాసానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇందులో భాగంగానే ఐదు నెలలకు సరిపడా 286.30 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందుబాటులో ఉంచామని అధికారులు పేర్కొన్నారు.

## 7 వేలకు పైగా స్టూడెంట్స్‌కు హెచ్ఐవీ


### విద్యార్థుల్లో పెరుగుతున్న హెచ్ఐవీ కేసులు,

### ఇక అన్ని కాలేజీల్లో తప్పనిసరి క్యాంపులు

### ప్రభుత్వం ఎమర్జెన్సీ చర్యలు

### హెచ్ఐవిలో మూడో స్థానంలో కర్ణాటక

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**




యువతలో హెచ్ఐవి వ్యాప్తిని ముందుగానే గుర్తించి నివారించేందుకు కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని ఇంజనీరింగ్, ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో విద్యార్థులకు కాలేజీల ప్రాంగణంలోనే హెచ్ఐవి పరీక్షలు, కౌన్సెలింగ్ సేవలు అందించనుంది. కర్ణాటక రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంఘం చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ దిశగా నిర్ణయం తీసుకుంది. విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీ, కాలేజీల విద్యా శాఖ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. విద్యార్థుల గోప్యతకు పూర్తి గౌరవం ఇస్తామని ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ ప్రయోజనం కోసం 'నో యువర్ హెచ్ఐవి స్టేటస్' అనే క్యూఆర్ కోడ్ యాప్‌ను డెవలప్ చేయనున్నారు. గతంలో, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కూడా అన్ని ఉన్నత విద్యా సంస్థలను హెచ్ఐవిపై అవగాహన కల్పించాలని కోరాయి. ఈ చొరవలో భాగంగా టెస్టులు, కౌన్సెలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తగా పలు కాలేజీల్లో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు.

**మూడో స్థానంలో కర్ణాటక :**

ఈ ప్రణాళికకు సహకరించాలని ఆరోగ్య శాఖ అన్ని కాలేజీల ప్రిన్సిపాల్‌లను ఆదేశించింది. విద్యార్థులలో పెరుగుతున్న కేసుల దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ గణాంకాల ప్రకారం.. హెచ్ఐవి సోకిన వారి సంఖ్యలో కర్ణాటక దేశంలో మూడో స్థానంలో ఉంది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రకారం.. కర్ణాటకలో మొత్తం 2,60,000 మంది హెచ్ఐవితో బాధపడుతున్నారు. వీరిలో, సుమారు 54వేల మందికి తమ హెచ్ఐవీ వ్యాధి ఉందనే తెలియదు. రాష్ట్రంలో 18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు గల రోగులు 7వేలు మంది ఉన్నారు. 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయస్సు వారిలో ఈ సంక్రమణ వేగంగా వ్యాపిస్తోందని గణాంకాలు చూపిస్తున్నాయి. 2023-24లో ఈ వయస్సు వర్గంలో 44,500 మందికి హెచ్ఐవి ఉన్నట్లు నిర్ధారణ కాగా, ఈ సంఖ్య 2025-26 నాటికి 66వేలకు పెరుగుతుందని అంచనా. నివేదికల ప్రకారం.. అసురక్షిత లైంగిక సంబంధాలు, మాదకద్రవ్యాల వాడకం హెచ్ఐవి కేసుల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా తేలింది. అందుకే ఈ వ్యాధిని ముందుగానే గుర్తించి, అది తీవ్రరూపం దాల్చకుండా నివారించేందుకు కాలేజీ విద్యార్థులకు హెచ్ఐవి పరీక్షలు నిర్వహించాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయించింది.

## డిఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

మొదటి పేజీ తరువాయి...

దాగి ఉందని, దీనిపై సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో సీబీఐ విచారణ జరిపిస్తేనే అసలు నిజాలు బయటకు వస్తాయని రోజా స్పష్టం చేశారు. ఇదే అంశంపై మాజీ మంత్రి పేర్ని నాని మచిలీపట్నం ర్యాలీ నిర్వహించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పై నేరుగా సవాళ్లు విసిరారు. డీఎస్సీ మెరిట్ జాబితాను బహిరంగంగా ప్రచురించకుండా, అభ్యర్థుల ఫోన్లకు మాత్రమే మార్కుల మెసేజ్‌లు పంపడం వెనుక ఉన్న రహస్యమేమిటని ప్రశ్నించారు. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా కింద నిబంధనలకు విరుద్ధంగా టెట్, డీఎస్సీ అర్హత కూడా లేని వందలాది మందికి దొడ్డిదారిన ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించిన ఆయన, స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన 421 మంది వ్యాయామ ఉపాధ్యాయుల సర్టిఫికెట్లు, మెరిట్ లిస్ట్‌ను బహిరంగంగా విడుదల చేసే ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. కేంద్రంలో నీట్ వివాదంపై నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామాలు చేస్తున్న తరుణంలో, ఏపీలో 3.5 లక్షల మంది అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్న లోకేష్ ఎందుకు రాజీనామా చేయడం లేదని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పాటు ఇతర ముఖ్య నేతలు ప్రశ్నించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విజయవాడ, అనంతపురం, రాజమండ్రి, అనకాపల్లి, వైఎస్సార్ జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన రంగాలు చేపట్టిన ర్యాలీల్లో పాల్గొన్న పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు లోకేష్ వైఖరిని ఎండగట్టారు. గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన నాడు-నేడు, ఇంగ్లిష్ మీడియం వంటి సంస్కరణలను రద్దు చేసి విద్యా వ్యవస్థను నాశనం చేశారని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోయినా, నారా లోకేష్ రాజీనామా చేయకపోయినా తమ పోరాటాన్ని వీధుల్లోకి తీసుకెళ్తామని వైఎస్సార్‌సీపీ హెచ్చరించింది. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు, ఈ నియామకాల అక్రమాలపై నిష్పాక్షికమైన సీబీఐ విచారణకు ఆదేశించే వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు, కలెక్టరేట్ల ముట్టడులు కొనసాగిస్తామని వైఎస్సార్‌సీపీ శ్రేణులు స్పష్టం చేశాయి.

## ప్రారంభోత్సవ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

మొదటి పేజీ తరువాయి...

రహదారుల పనులు, పార్కింగ్, టెర్మినల్ బిల్డింగ్, బహిరంగ సభ వేదిక, భద్రత, జనసమీకరణ, ప్రోటోకాల్ గ్యాలరీ, భోజనం, రవాణా ఏర్పాట్లపై ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి నారా లోకేష్ పలు సూచనలు చేశారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి 32 నియోజకవర్గాల నుంచి దాదాపు 3 లక్షల మంది హాజరవుతారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. బహిరంగ సభ వేదికలో వీవీఐపీ సీటింగ్ సామర్థ్యాన్ని 520 నుంచి వెయ్యికి పెంచామని, వీఐపీ 3వేలు, వెయ్యి మంది ఛాంపియన్స్, విమానాశ్రయానికి భూములు ఇచ్చిన వారు ఆసీనులయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజల కోసం ప్రధాన రహదారికి ఇరువైపులా 20 భోజనం కౌంటర్లు ఏర్పాటుచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని మంత్రి లోకేష్ సూచించారు. విద్యార్థుల విషయంలో అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కే.అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, కొలుసు పార్థసారథి, బీసీ జనార్ధన్ రెడ్డి, డోలా బాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, కళా వెంకట్రావు, ఏలూరి సాంబశివరావు, పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, అరిమిల్లి రాధాకృష్ణ, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిలారు రాజేష్, కార్యక్రమాల కమిటీ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర యాదవ్, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, విజయనగరం డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే ఎస్.వీ.ఎస్.ఎన్ వర్మ, జీఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ ఛైర్మన్ జీబీఎస్ రాజు, స్టేట్ మీడియా కోఆర్డినేటర్ బీవీ. రాముడు, ప్రధాని పర్యటన నోడల్ అధికారి ఎంటీ కృష్ణబాబుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వదల బొమ్మాళీ...పాడేరును వదలా...!

### భీష్మించుకున్న పాడేరు వైద్య శాఖ భూతాలు

### అందరికీ తెలిసిపోయిన అవినీతి కిరణాలు

**(ఎంకే సునీల్ కుమార్ - జయ జయహే బ్యూరో )**

పాడేరు వైద్య ఆరోగ్య శాఖకు పట్టిన భూతాల భరతం ఎప్పుడు పడతారనే ఆశతో గిరిజనం ఎదురు చూస్తున్నారు. ఆ ముగ్గురు భూతాల తీరుపై జయ జయహే పత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనంపై బాధిత వైద్య ఉద్యోగులంతా ప్రభుత్వంలోని వివిధ నిఘా..విజిలెన్స్...విచారణ అధికారులకు అందజేశారు. ఆ ముగ్గురు కారణంగా తాము ఎలా నష్టపోయామో...ఎంత దారుణంగా హింసించారో వివరిస్తూ ఉన్నతాధికారులకు లేఖలు రాశారు. సాక్షాత్తు ఏఎస్ఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశించినా ఈ ముగ్గురు పట్టించుకునే వారు కాదన్న అభిప్రాయం అక్కడి ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. తమకనుకూలంగా ఉంటే ఒకలా...లేకుంటే మరోలా ఉత్తర్వులు జారీ చేసేవారని అందుకు అనేక ఉదాహరణలు చెబుతున్నారు. సస్పెన్షన్‌కు గురైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాయక్‌ను తమ చెప్పు చేతల్లో పెట్టుకుని ఇష్టాను సారంగా నేషనల్ హెల్త్ మిషన్ నిధులను కొల్లగొట్టారని తాజాగా ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఉద్యోగుల పేరిట రూ. లక్షల్లోనే కాజేశారని చెబుతున్నారు. ఎన్నో అవినీతి అక్రమాలతో రెచ్చిపోయిన సదరు బృందంలోని అసలు సిసలైన ఉద్యోగులను ఇక్కడి నుంచి మరెక్కడికైనా వెళ్లిపోతే ఈ అవినీతి మరకలు సద్దుమణుగుతాయని సలహా ఇస్తుంటే...అబ్బే ఇక్కడే ఉంటాం...మామీద ఈగ వాలకుండా చూసుకునే రాజకీయ అండ ఉందంటూ బుకాయిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. వీరి అవినీతికి సంబంధించి మరిన్ని






వివరాల్లోకి వెళితే...! అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కొంతకాలంగా పరిపాలనా అవకతవకలు పెట్రేగిపోతున్నాయి. అక్రమ డిప్యూటేషన్లు , ఇతర ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కొన్నాళ్ళుగా గిరిజన సంఘాల నేతలు సీఎంఓ కార్యాలయం వరకూ వెళ్లి విజ్ఞప్తి చేశారు. హుకుంపేట మండలంలోని అడ్డుమండ ఏఎనఎం సస్పెన్షన్‌కు సంబంధించిన ఫైల్ వ్యవహారంలో కూడా నిబంధనలకు విరుద్ధంగా చర్యలు చేపట్టారని ఈ భూతాలపై ఆరోపణలు ఉన్నాయి. అక్రమ డిప్యూటేషన్లు, మెటర్నిటీ సెలవుల ఫైళ్లు, ఏఎనఎం ప్రమోషన్లు, ఫీల్డ్ హెల్త్ అసిస్టెంట్ల బదిలీలు తదితర అంశాల్లో కూడా పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఉద్యోగులు బాహాటంగానే పేర్కొంటున్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేయాల్సిన సిబ్బందిని నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాలకు పంపిన వ్యవహారంపై కూడా సమగ్ర విచారణను కోరుతున్నారు. ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన కంప్యూటర్లు, టేబుళ్లు ఇతర మౌలిక సదుపాయాల సామగ్రి ఒక సెంట్రల్ డ్రగ్ స్టోర్ లో పని చేస్తున్న ఐటీడీఏ డేటా ఎంట్రీ ఆపరేటర్ ద్వారా ఏఎనఎల్ పార్సెల్ సర్వీసు పాడేరు నుండి విజయనగరం తరలించినట్లు నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వీటిపై కూడా ఏసీబీ విజిలెన్స్ ద్వారా ఎంక్వయిరీ చేసి అసలు దొంగలను పట్టుకోవాలని ఉద్యోగులు కోరుకుంటున్నారు అల్లూరి జిల్లా నేషనల్ హెల్త్ మిషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వివరాలు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించి ఏయే వస్తువులు ఎవరెవరికి ఎవరి అనుమతితో ఇచ్చారో లెక్క తీస్తే నా...సామి రంగా....ఈ భూతాల అసలు భండారం బయటపడుతుందని పాడేరు కోడై కూస్తోంది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కృష్ణమూర్తి నాయక్ సస్పెన్షన్ అయిన తర్వాత కూడా తమపై విచారణ చేపట్టడంపై వీరు ఏకంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులపై నిప్పులు చెరుగుతున్నారు. ఓ సారి ఫిర్యాదులపై విచారణ చేపట్టిన చర్యలు తీసుకున్నాక మళ్లీ తమపై విచారణ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులపైనే వీరు ఏకంగా తిట్ల దండకం అందుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. తాము చెప్పినట్టు తోకాడించే డీఎం అండ్ హెచఓ సస్పెన్షన్ తర్వాత కూడా తమపై విచారణ చేయడాన్ని రాజకీయంగా తమకనుకూలంగా చేసుకోవాలని ఉవ్వీళ్లూరుతున్నారు.



## మనిషికి ఆరోగ్యాన్ని మించిన సంపద లేదు

### ఎమ్మెల్యే ఆదిమూలం.

**సత్యవేడు, జులై 28,జయ జయహే.**

మనిషికి ఆరోగ్యాన్ని మించిన సంపద లేదని ఆటలు, వ్యాయామం, యోగాతోనే సాధ్యమని ఎమ్మెల్యే అధిములం అన్నారు. మంగళవారం సత్యవేడులో నియోజకవర్గస్థాయి అమరావతి ఛాంపియన్షిప్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల నుండి భారీ సంఖ్యలో విద్యార్థులు తరలి వచ్చి క్రీడల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలు చదువుకోవాలన్న జ్ఞాపక శక్తి పెరగాలన్న శరీరం చురుగ్గా ఉంటేనే అది సాధ్యం దానికి ఏకైక మార్గం పిల్లలకు ఆటల పట్ల మక్కువ ఏర్పడేటట్లు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, ఉపాధ్యాయులు పి ఇ టి మాస్టర్లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టెక్కలి డిగ్రీ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణలు

### ప్రిన్సిపాల్ టీ గోవిందమ్మ వెల్లడి

**టెక్కలి జూలై 28 జయ జయహే**



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగులకు ఉచిత స్కిల్ హబ్ కంప్యూటర్ శిక్షణలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టీ గోవిందమ్మ తెలిపారు. మూడు నెలలు ఉచిత శిక్షణ ద్వారా కస్టమర్ కేర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ వాయిస్ అండ్ నాన్ వాయిస్ పద్ధతి లో ఉచిత శిక్షణ అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. 10వ తరగతి ఆపైన చదువుకున్న నిరుద్యోగులు ఆగస్టు 7వ తేదీ లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## శ్రీ బాలనాగాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

**సత్యవేడు, జులై 28,జయ జయహే.**



సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం మంగళవారం శ్రీ బాలనాగాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొంది, సత్యవేడు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



## ప్రారంభమైన వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు

**చోడవరం జూలై 28 జయ జయహే**

చోడవరంలో గల ఆపదహార శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో 47వ వార్షిక పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యాగశాల అర్చనఅర్చన నిత్య హోమాలు చక్రాబ్జా మండలార్చన విశేష హోమాలు పరివార దేవత హోమాలు మంగళ శాసనాలు నిర్వహించారు. ఉత్సవాలు ఈనెల 29వ తేదీతో ముగిస్తాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి కె.వి ఆశా కిరణ్మయి , ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ వింజమూరు గౌరీ శంకర్ ప్రసాద్, కమిటీ సభ్యులు శ్రీవారి సేవకులు ఆలయ ప్రధాన అర్చకులు గుంటూరు శాంతా రామాచార్యులు, వెంకట లక్ష్మీనారాయణ చార్యులు పుర ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

# వేగంగా విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లు

### ప్రధాని పర్యటన విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి

### భోగాపురంలో ఏర్పాట్లపై మంత్రి నారా లోకేష్ సమీక్ష

**భోగాపురం, జూలై 28, జయ జయహే**

భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రధాని పర్యటన విజయవంతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఆగష్టు 1వ తేదీన రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై భోగాపురం విమానాశ్రయంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కే.రామ్మోహన్ నాయుడుతో కలిసి అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం భోగాపురంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారుల పనులు, పార్కింగ్, టెర్మినల్ బిల్డింగ్, బహిరంగ సభ వేదిక, భద్రత, జనసమీకరణ, ప్రోటోకాల్ గ్యాలరీ, భోజనం, రవాణా ఏర్పాట్లపై ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికారులు పవర్



పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి నారా లోకేష్ పలు సూచనలు చేశారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి 32 నియోజకవర్గాల నుంచి దాదాపు 3 లక్షల మంది హాజరవుతారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. బహిరంగ సభ వేదికలో వీవీఐపీ సీటింగ్ సామర్థ్యాన్ని 520 నుంచి వెయ్యికి పెంచామని, వీఐపీ 3వేలు, వెయ్యి మంది ఛాంపియన్స్, విమానాశ్రయానికి భూములు ఇచ్చిన వారు ఆసీనులయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజల కోసం ప్రధాన రహదారికి ఇరువైపులా 20 భోజనం కౌంటర్లు ఏర్పాటుచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల విషయంలో అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అంబులెన్స్ లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కే.అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, కొలుసు పార్థసారథి, బీసీ జనార్ధన్ రెడ్డి, డోలా బాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, కళా వెంకట్రావు, ఏలూరి సాంబశివరావు, పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, అరిమిల్లి రాధాకృష్ణ, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిలారు రాజేష్, కార్యక్రమాల కమిటీ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర యాదవ్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, విజయనగరం డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే ఎస్.వీ.ఎస్.ఎన్ వర్మ, జీఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ చైర్మన్ జీబీఎస్ రాజు, స్టేట్ మీడియా కోఆర్డినేటర్ బీవీ. రాముడు, ప్రధాని పర్యటన నోడల్ అధికారి ఎంటీ కృష్ణబాబుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## దర్గా అభివృద్ధికి రూ.ఒక లక్ష విరాళం అందించిన గజల్ శ్రీనివాస్

**శ్రీకాళహస్తి, జులై 28,జయ జయహే.**

పట్టణంలోని స్వర్ణముఖి నది తీరంలో వెలసిన హజరత్ జూమ్ లేషా పీర్ దర్గా అభివృద్ధి కోసం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అవార్డు గ్రహీత, ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ రూ.ఒక లక్ష విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దర్గా ఆవరణలో భక్తుల సౌకర్యార్థం రూఫ్‌టాప్ నిర్మాణం, మరుగుదొడ్లు, భక్తులు వంటలు చేసుకునేందుకు ప్రత్యేక ప్రదేశం ఏర్పాటు చేయడానికి సుమారు రూ.10 లక్షల వ్యయం అవుతుందని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా తన వంతు సహాయంగా మొదటగా రూ.ఒక లక్ష విరాళం అందిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే,మత సామరస్యానికి అతీతంగా జరుగు ఈ కార్యక్రమంనకు అందరూ చేయి చేయి కలిపి సహకరిస్తే భక్తుల సౌకర్యార్థం చేపట్టిన ఈ మంచి కార్యక్రమం విజయవంతమవుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దర్గా పెద్దలు సయ్యద్ అహ్మద్, సయ్యద్ బాబా ఫరీద్, ఉరుసు కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, రాజేశ్వరరావు, ఉదయ్, జమురుద్దీన్ భాష తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీపై జగన్ మోసపూరిత మాటలు: గంటా

**విశాఖపట్నం, జులై 28: (జయ జయహే)**



ఎన్నికల్లో ప్రతి ఏటా జాబ్ కేలండర్, డీఎస్సీ హామీతో 2019 లో అధికారంలోకి వచ్చి నిరుద్యోగులను అయిదేళ్ల పాటు నిలువునా మోసం చేసిన జగన్మోహన్ రెడ్డి మళ్లీ అదే మేకవన్నె పులి వేషాలకు తెర తీశారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి ఎన్నికల మేనిఫెస్టో లో చెప్పినట్టు 16,347 పోస్టుల మెగా డీఎస్సీ ఫైలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేస్తే 240 కేసులు వేసి మోకాలడ్డడానికి దిగజారుడు యత్నాలు చేశారన్నారు. పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీపై ఈరోజుకీ విషం చిమ్మడానికి జగన్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వని జగన్మోహన్ రెడ్డికి మెగా డీఎస్సీ గురించి మాట్లాడే అర్హతే లేదన్నారు. 14 డీఎస్సీలలో 1,96,619 టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనచరిత్ర తెలుగుదేశం పార్టీకి ఉందని, తాను విద్యా శాఖ మంత్రిగా 2014, 2018, 2019లలో డీఎస్సీల ద్వారా 16,701 మందిని రిక్రూట్ చేసుకుని యువత భవిష్యత్ కు భరోసా ఇచ్చామని తెలిపారు. నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా కేవలం 150 రోజుల్లో మెగా డీఎస్సీ నియామకాలు పూర్తి చేసి.. రెండో డీఎస్సీకి సన్నద్ధమవుతున్నారని, మెగా డీఎస్సీ గురించి చేస్తున్న పిచ్చి ప్రేలాపనల నిగ్గు తేల్చే చర్చ కోసం డేట్, టైం చెప్పాలని లోకేష్ చేసిన సవాల్ ను స్వీకరించే దమ్ముందా అని జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నించారు. కేవలం రాజకీయ లబ్ధి పొందాలనే ఆలోచనతో.. నీట్ పరీక్షా పత్రం లీక్ కి మెగా డీఎస్సీ నియామక ప్రక్రియకి లింక్ పెట్టి ప్రజల దృష్టిలో అభాసుపాలయ్యారని ఎద్దేవా చేశారు.




## పేపర్ మిల్లులో టిఎన్‌టియుసిసి జోరు.. గంట గుర్తుకు భారీ మద్దతు!

**రాజమహేంద్రవరం: జయ జయహే: జూలై28:**

ఎపి పేపర్ మిల్లు కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకున్న వేళటిఎన్‌టియుసి నిర్వహించిన బహిరంగ సభకు కార్మికులు భారీగా హాజరై సంఘీభావం తెలిపారు. పేపర్ మిల్ ప్రధాన గేటు వద్ద సోమవారం జరిగిన ఈ సభలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పాల్గొని కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు.ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, గతంలో నిలిచిపోయిన వేతన ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వమే పూర్తి చేసిందని తెలిపారు. కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని, సిఎస్ఆర్ నిధులతో పేపర్ మిల్ పరిసర ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. టీఎన్‌టీయూసీ మేనిఫెస్టోలోని హామీలన్నింటినీ అమలు చేస్తామని, ఎన్నికల్లో గెలిచిన మూడు నెలల్లోనే మరో వేతన ఒప్పందం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా, రిటైర్మెంట్‌కు చేరువలో ఉన్న వారికి న్యాయం, శాశ్వత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. టిఎన్‌టియుసి అభ్యర్థులను గెలిపించి గంట గుర్తుకు ఓటు వేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం విషయంలో తమ కుటుంబం ఎప్పుడూ రాజీ పడలేదన్నారు. పరంపర కార్మికుల సమస్యల పరిష్కారం, వేతన ఒప్పందం, శాశ్వత ఉద్యోగాల కోసం నిరంతరం కృషి చేశామని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు అవకాశాలు, మెరుగైన వైద్య సేవలు, వెల్ఫేర్ ఫండ్ వినియోగం, క్యాంటీన్ సౌకర్యాల మెరుగుదల, సినియారిటీ ఆధారంగా ప్రమోషన్లు, ఎక్స్‌గ్రేషియా పెంపు వంటి హామీలను అమలు చేస్తామని చెప్పారు.సభకు మజ్జి రాంబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నక్కా చిట్టిబాబు, కాశీ నవీన్ కుమార్, దొండపాటి సత్యంబాబు, వఱ్రే శ్రీనివాస్, కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, దుత్తరపు గంగాధర్, అధ్యక్ష అభ్యర్థి ఆకుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అభ్యర్థి సందీప్ తదితరులు ప్రసంగించి టిఎన్‌టియుసి కి మద్దతుగా గంట గుర్తుకు ఓటు వేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. సభకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరయ్యారు.




# అనుభవమా? నైపుణ్యమా? నీతినా?

## వృత్తి ప్రపంచం ముందున్న అసలు సవాలు

మనిషి చరిత్రలో ఎన్నడూ లేనంత వేగంతో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో వృత్తిపరమైన శ్రేష్ఠతకు అసలు ప్రమాణం ఏమిటనే ప్రశ్న మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉన్నత విద్య, అపారమైన అనుభవం, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు---ఇవన్నీ అవసరమే. కానీ ఇవి మాత్రమే సరిపోతాయా? లేక వాటిని మించిన మరొక అంతర్గత విలువ అవసరమా?

ఒకప్పుడు అనుభవాన్ని విజ్ఞానానికి పరాకాష్ఠగా భావించేవారు. అనుభవజ్ఞుడు తప్పు చేయడని నమ్మకం ఉండేది. తరువాత కాలంలో నైపుణ్యం ప్రాధాన్యతను సంతరించుకుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగంగా అందిపుచ్చుకున్నవారే విజయవంతులని భావించారు. కానీ నేడు ప్రపంచం మరో వాస్తవాన్ని గుర్తిస్తోంది. అనుభవం ఉన్నవారిలోనూ అవినీతి కనిపిస్తోంది అత్యున్నత నైపుణ్యాలు కలిగిన వారిలోనూ బాధ్యతారాహిత్యం దర్శనమిస్తోంది. అప్పుడు ప్రశ్న తలెత్తుతుంది---సమస్య జ్ఞాన లోపమా? నైపుణ్య లోపమా? లేక విలువల లోపమా?

నేటి వృత్తి ప్రపంచంలో వ్యక్తి రెండు ప్రపంచాల మధ్య తల్లడిల్లుతున్నాడు. ఒకవైపు వ్యక్తిగత ప్రయోజనాలు పదోన్నతులు ఆర్థిక లాభాలు మరోవైపు సంస్థాగత బాధ్యతలు వృత్తి నైతికత ప్రజా ప్రయోజనాలు. ఈ రెండింటి మధ్య సంఘర్షణ ఏర్పడినప్పుడు నిజమైన వ్యక్తిత్వం బయటపడుతుంది. అక్కడ అనుభవం మాత్రమే సరిపోదు. నైపుణ్యం మాత్రమే మార్గం చూపదు. నీతి నియమాల పట్ల అచంచలమైన నిబద్ధత అవసరం.

సాంకేతికత మనిషికి అపారమైన శక్తిని ఇచ్చింది. కృత్రిమ మేధస్సు, డిజిటల్ వ్యవస్థలు, డేటా విశ్లేషణ---ఇవన్నీ నిర్ణయాలను వేగవంతం చేస్తున్నాయి. కానీ ఏ సాంకేతిక వ్యవస్థకూ నైతిక వివేకం ఉండదు. అది మనిషి నుంచే రావాలి. సాంకేతికత "ఏం చేయవచ్చు?" అనే ప్రశ్నకు సమాధానం చెబుతుంది. కానీ "ఏం చేయాలి?" అనే ప్రశ్నకు సమాధానం చెప్పేది మనిషి విలువలే.

అందుకే నేటి ప్రపంచానికి కేవలం నిపుణులు సరిపోరు నైతిక నిపుణులు కావాలి. కేవలం అనుభవజ్ఞులు సరిపోరు బాధ్యతాయుతమైన అనుభవజ్ఞులు కావాలి. కేవలం సాంకేతిక ప్రతిభ సరిపోదు; సామాజిక బాధ్యతతో కూడిన ప్రతిభ అవసరం.

వృత్తి శ్రేష్ఠత అనేది అనుభవం, నైపుణ్యం నైతికతలలో ఏ ఒక్కదానితోనూ పూర్తికాదు. అనుభవం దారిని చూపాలి. నైపుణ్యం ఆ దారిలో నడిపించాలి. నీతి ఆ ప్రయాణాన్ని సన్మార్గంలో ఉంచాలి. ఈ మూడింటి సమన్వయమే వ్యక్తిని విజయవంతుడిగా మాత్రమే కాకుండా విశ్వసనీయుడిగా ఆదర్శప్రాయుడిగా సమాజానికి ఉపయోగపడే నాయకుడిగా తీర్చిదిద్దుతుంది.


నేడు ప్రపంచం ఎదురుచూస్తున్నది అత్యంత తెలివైన మనుషులను కాదు తమ తెలివిని ధర్మం,వివేకం, నిజాయితీలతో వినియోగించే మనుషులను. ఎందుకంటే చరిత్ర చెబుతున్న సత్యం ఒక్కటే---నైపుణ్యం విజయాన్ని ఇవ్వగలదు, కానీ నైతికత మాత్రమే గౌరవాన్ని నిలబెడుతుంది.

డాక్టర్ విశ్వేశ్వరరావు కొణపల

# గురుత్వానికి శాశ్వత చిరునామా వేద వ్యాస మహర్షి

(సి.హెచ్.ప్రతాప్)

**ఆషాఢ పౌర్ణమి భారతీయ సంస్కృతిలో కేవలం ఒక పర్వదినం కాదు. అది జ్ఞానానికి నమస్కరించే రోజు... గురువుకు కృతజ్ఞత అర్పించే రోజు... వ్యాస మహర్షి వెలిగించిన జ్ఞానజ్యోతిని స్మరించుకునే రోజు. అందుకే ఈ పవిత్ర దినాన్ని వ్యాస పూర్ణిమ, గురు పూర్ణిమగా యుగయుగాలుగా ఆచరిస్తున్నారు. గురువు స్థానాన్ని దేవత్వంతో సమానంగా భావించిన భారతీయ సంప్రదాయం, ఆ గురుత్వానికి జీవం పోసిన మహర్షిగా వ్యాసుణ్ని ఆదిగురువుగా గౌరవించింది.**



కృష్ణ ద్వైపాయనుడిగా జన్మించిన వ్యాస మహర్షి సాధారణ ఋషి కాదు. భారతీయ జ్ఞాన సంపదకు సంరక్షకుడు, సంస్కృతికి శిల్పి, ధర్మానికి మార్గదర్శి. అపారమైన వేదసంపదను మానవాళికి సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు ఆయన వేదాలను ఋగ్, యజుర్, సామ, అథర్వ వేదాలుగా విభజించారు. ఈ మహత్తర కృషి వల్లే ఆయన వేదవ్యాసుడు అయ్యారు. వేదాలను కాపాడటమే కాదు, వాటిని తరతరాలకు చేరేలా గురు-శిష్య పరంపర ద్వారా వ్యవస్థీకరించారు. అందుకే భారతదేశంలో గురుత్వానికి మూలపురుషుడిగా ఆయనను స్మరిస్తారు.

వ్యాస మహర్షి రచించిన మహాభారతం ప్రపంచంలోనే అతి విస్తారమైన ఇతిహాసం మాత్రమే కాదు; మానవ జీవితానికి అద్దం. రాజనీతి నుంచి కుటుంబ విలువల వరకు, ధర్మం నుంచి కర్తవ్యబోధ వరకు, నాయకత్వం నుంచి ఆత్మవికాసం వరకు ప్రతి అంశాన్నీ అది ఆవిష్కరిస్తుంది. అదే మహాభారతంలో భాగమైన భగవద్గీత కోట్లాది మంది జీవితాలకు దిశానిర్దేశం చేస్తూనే ఉంది. పద్దెనిమిది పురాణాలు, బ్రహ్మసూత్రాలు వంటి మహాగ్రంథాల ద్వారా వ్యాస మహర్షి భారతీయ తాత్విక చింతనకు శాశ్వత రూపం ఇచ్చారు.

**వ్యాస మహిమను స్మరించే ప్రసిద్ధ శ్లోకం---**

**వ్యాసాయ విష్ణురూపాయ**
**వ్యాసరూపాయ విష్ణవే।**
**నమో వై బ్రహ్మనిధయే**
**వాసిష్ఠాయ నమో నమః॥**

భావం: విష్ణుస్వరూపుడైన వ్యాస మహర్షికి నమస్కారం. బ్రహ్మజ్ఞానానికి నిలయమైన ఆ మహర్షికి పదేపదే ప్రణామాలు. ఈ శ్లోకం వ్యాసుడు కేవలం గ్రంథకర్త మాత్రమే కాదని, జ్ఞానానికి సజీవ ప్రతిరూపమని తెలియజేస్తుంది.

గురు పూర్ణిమను వ్యాస పూర్ణిమగా జరుపుకోవడం వెనుక ఉన్న సందేశం అత్యంత గొప్పది. గురువు అనేది కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి కాదు; మనిషిలో దాగి ఉన్న సామర్థ్యాన్ని మేల్కొలిపే శక్తి. అజ్ఞానాన్ని తొలగించి వివేకాన్ని వెలిగించే మహోన్నత బాధ్యత గురువుది. ఆ బాధ్యతను తన జీవితమంతా నిర్వర్తించిన మహర్షి వ్యాసుడు గురుత్వానికి శాశ్వత ప్రతీకగా నిలిచారు.

**ఈ భావాన్ని ప్రతిధ్వనించే శ్లోకం---**

**గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణుః**
**గురుర్ దేవో మహేశ్వరః।**
**గురుః సాక్షాత్ పరబ్రహ్మ**
**తస్మై శ్రీ గురవే నమః॥**

భావం: సృష్టించే బ్రహ్మ, పరిరక్షించే విష్ణు, అజ్ఞానాన్ని నిర్మూలించే మహేశ్వరుడు ఎలా దైవస్వరూపులో, జీవితాన్ని జ్ఞానమార్గంలో నడిపించే గురువూ అలాగే పరబ్రహ్మ స్వరూపుడు.


నేటి ప్రపంచంలో సమాచారం క్షణాల్లో లభిస్తోంది. కానీ సమాచారం మనిషిని మహోన్నతుడిని చేయదు; దానికి విలువలు, వివేకం, ధర్మబోధ జతకలిసినప్పుడే అది జ్ఞానంగా మారుతుంది. ఆ జ్ఞానానికి మార్గదర్శకుడు గురువు. ఆ గురుత్వానికి చిరస్థాయి ప్రమాణం వ్యాస మహర్షి.

అందుకే గురు పూర్ణిమ రోజున వ్యాసుణ్ని స్మరించడం అంటే గతాన్ని ఆరాధించడం కాదు; జ్ఞానాన్ని గౌరవించడం. గురువును పూజించడం అంటే వ్యక్తిని మాత్రమే కాదు, ఆయన ద్వారా ప్రసరించే విజ్ఞానాన్ని, సంస్కారాన్ని, మానవతా విలువలను నమస్కరించడం. ప్రతి తరం జ్ఞానాన్ని తదుపరి తరానికి అందించేంతవరకు వ్యాస మహర్షి జీవిస్తూనే ఉంటారు. భారతీయ సంస్కృతి నిలిచేంతకాలం వ్యాసుడు ఒక మహర్షిగా కాదు... ప్రతి గురువులో దర్శనమిచ్చే ఆదిగురువుగా, ప్రతి శిష్యుడిలో స్ఫూర్తిని నింపే శాశ్వత జ్ఞానజ్యోతిగా వెలుగుతూనే ఉంటారు.

# గురు-శిష్య సంప్రదాయానికి మహోత్సవం గురు పూర్ణిమ

(సి.హెచ్.ప్రతాప్)

**భారతీయ సంస్కృతిలో గురు పూర్ణిమ అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక పర్వదినంగా భావించబడుతుంది. ఆషాఢ మాస పౌర్ణమి రోజున నిర్వహించే ఈ ఉత్సవం జ్ఞానానికి, సంస్కారానికి, గురు-శిష్య పరంపరకు ప్రతీకగా నిలుస్తుంది. మహర్షి వేదవ్యాసుని జన్మదినంగా ఈ రోజును "వ్యాస పూర్ణిమ" అని కూడా పిలుస్తారు. వేదాలను విభజించి, మహాభారతం, బ్రహ్మసూత్రాలు, పద్దెనిమిది పురాణాల వంటి మహోన్నత గ్రంథాలను అందించిన వ్యాసమహర్షికి నివాళిగా ఈ పర్వదినాన్ని ఆచరిస్తారు.**




గురువు స్థానం భారతీయ సంప్రదాయంలో దేవునికంటే గొప్పదిగా పేర్కొనబడింది. గురువు అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగిస్తాడు. ఈ భావాన్ని తెలియజేసే ప్రసిద్ధ శ్లోకం:

గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణుః
గురుర్ దేవో మహేశ్వరః ।
గురుః సాక్షాత్ పరబ్రహ్మ
తస్మై శ్రీ గురవే నమః ॥

భావం: గురువు సృష్టికర్త బ్రహ్మస్వరూపుడు, పోషకుడు విష్ణుస్వరూపుడు, అజ్ఞానాన్ని నాశనం చేసే మహేశ్వరస్వరూపుడు. పరబ్రహ్మ స్వరూపమైన గురువుకు నమస్కరిస్తున్నానని ఈ శ్లోకం తెలియజేస్తుంది.

గురువు కేవలం విద్యను బోధించే వ్యక్తి మాత్రమే కాదు; వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే మార్గదర్శి. సత్యం, ధర్మం, క్రమశిక్షణ, వినయం వంటి విలువలను జీవితంలో ఆచరించేలా ప్రేరేపించేవాడే నిజమైన గురువు. అందుకే ఉపనిషత్తులు ఇలా ఉపదేశించాయి:

ఆచార్య దేవో భవ।

భావం: గురువును దేవునిలా గౌరవించు. గురువు పట్ల భక్తి, వినయం, కృతజ్ఞత కలిగి ఉండాలని ఈ వాక్యం బోధిస్తుంది.

గురు పూర్ణిమ రోజున శిష్యులు తమ గురువులను దర్శించి ఆశీస్సులు తీసుకోవడం, పాదపూజ చేయడం, గురుదక్షిణ సమర్పించడం వంటి సంప్రదాయాలు కొనసాగుతున్నాయి. విద్యాసంస్థలు, ఆశ్రమాలు, యోగా కేంద్రాలు, ఆధ్యాత్మిక సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి గురువుల సేవలను స్మరిస్తాయి. ఈ సందర్భంగా స్వీయపరిశీలన చేసుకొని, నేర్చుకున్న జ్ఞానాన్ని సమాజహితానికి వినియోగించాలని సంకల్పించడం కూడా ఈ పర్వదినంలోని ప్రధాన సందేశం.

గురువు మహిమను తెలియజేసే మరో శ్లోకం:

అజ్ఞాన తిమిరాంధస్య
జ్ఞానాంజన శలాకయా ।
చక్షురున్మీలితం యేన
తస్మై శ్రీ గురవే నమః ॥

భావం: అజ్ఞానం అనే చీకటిలో ఉన్నవారికి జ్ఞానం అనే అంజనాన్ని అందించి జ్ఞాన నేత్రాలను తెరిచిన గురువుకు నమస్కారం. ఈ శ్లోకం గురువు జీవితాన్ని ప్రకాశవంతం చేసే దీపస్తంభమని తెలియజేస్తుంది.

నేటి సాంకేతిక యుగంలో సమాచారం సులభంగా లభిస్తున్నప్పటికీ, సరైన దిశను చూపే గురువు అవసరం మరింత పెరిగింది. పుస్తకాలు విజ్ఞానాన్ని అందించగలవు; కానీ జ్ఞానాన్ని జీవితంలో ఎలా అన్వయించాలో గురువే నేర్పగలడు. అందుకే గురు పూర్ణిమ ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదు; జ్ఞానానికి నమస్కరించే, విలువలను స్మరించుకునే, గురు-శిష్య బంధాన్ని బలోపేతం చేసే సాంస్కృతిక ఉత్సవం. గురువుల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ, వారు చూపిన మార్గంలో నడవాలనే సంకల్పాన్ని పునరుద్ఘాటించేందుకు ఈ పవిత్ర దినం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుంది.




# భోగాపురం విమానాశ్రయం కీలక పాత్ర పోషిస్తుంది

## అరకు వ్యాలీలో అవగాహన ర్యాలీ

అరకులోయ: జూలై 28, జయ జయహే

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని అరకు వ్యాలీలో అవగాహన ర్యాలీ భోగాపురంలో ప్రారంభం కానున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం అరకు వ్యాలీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గిరిజన క్రీడా పాఠశాల, అరకు వ్యాలీ నుండి అరకు జంక్షన్ వరకు, మంగళవారం నిర్వహించిన ఈ ర్యాలీలో క్రీడాకారులు, శారీరక విద్యా సంచాలకులు పీడీలు, శారీరక విద్యా ఉపాధ్యాయులు పీఈటీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం రాష్ట్ర అభివృద్ధికి నూతన మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంటూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ విమానాశ్రయం ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతంతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యాటక, వాణిజ్య, ఆర్థిక రంగాలకు మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. ఆంధ్ర ఊటీ అరకులోయ సహజ సౌందర్యాన్ని, గిరిజన సంస్కృతిని ప్రపంచానికి మరింత చేరువ చేసే దిశగా ఈ అంతర్జాతీయ విమానాశ్రయం కీలక పాత్ర పోషిస్తుందని ర్యాలీలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు , ఈ కార్యక్రమం లో ప్రజలు కూడా ఉత్సాహంగా పాల్గొని తమ మద్దతు తెలిపి విజయవంతం చేశారని తెలిపారు.

## 30న శ్రీకాళహస్తి నిరుద్యోగ యువతకు

# మెగా జాబ్ మేళా

శ్రీకాళహస్తి, జులై 28,జయ జయహే.


శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి కృషి తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు 'నిర్మాణ్ ఆర్గనైజేషన్' సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న భారీ జాబ్ మేళా నిర్వహించనున్నారు. శ్రీకాళహస్తి ఎస్ వి ఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈకార్యక్రమంనిర్వహించనున్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐ టి ఐ,డిప్లొమా, డిగ్రీ, బి .టెక్ , పీజీ వారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ప్రముఖ ఎం ఎన్ సి ఎస్ అమరరాజా, డిక్సన్, అపోలో ఫార్మసీ, టీవీఎస్ మొదలైన కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు.ఎంపిక అయిన వారికి నెలకు జీతం రూ. 10,000, నుండి రూ. 25,000వేల వరకు ఇవ్వనున్నారు.వసతి, భోజన సదుపాయం కల్పించనున్నారు.నిరుద్యోగ యువతీ యువకులు రెజ్యూమ్, ఆధార్, సర్టిఫికేట్ల జిరాక్స్ కాపీలతో నేరుగా హాజరు కావాల్సి ఉంది.

# అనుమతులు లేకుండా అక్రమ భారీ రిసార్ట్ నిర్మాణం

## పట్టించుకోని అధికార యంత్రాంగం.. మండిపడుతున్న గిరిజనులు

**అరకులోయ: జూలై 28, జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం పద్మాపురం మేజర్ పంచాయతీ సమీపంలో అధికారుల అనుమతులు లేకుండా అక్రమ భారీ రిసార్ట్ నిర్మాణం జోరుగా సాగుతుంది. అరకులోయ మండలం ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఇక్కడ భూ బదలాయింపు చట్టం అమలలో ఉంటుంది. ముఖ్యంగా అరకులోయ పట్టణంలో భూపాదలాయింపు చట్టం పటిష్టంగా అమల్లో ఉండాలి.అయితే పంచాయితీ రెవిన్యూ అధికారులు అక్రమ నిర్మాణదారుల నుండి కాసులకు కక్కుర్తి పడి చట్టాలను తుంగలో తొక్కి అక్రమ భారీ రిసార్ట్ నిర్మాణాలకు ప్రోత్సహిస్తూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అరకులోయ పట్టణంలోని పద్మాపురం మేజర్ పంచాయతీ సమీపంలో గిరిజనేతరుడు గిరిజనుడుగా చలామణి, అవుతు ఆయన ఆధీనంలో అక్రమ భారీ రిసార్ట్ నిర్మాణం జరుగుతున్న పంచాయతీ, రెవిన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గిరిజనులు మండిపడుతున్నారు. గిరిజన చట్టాలను రక్షించవలసిన పంచాయతీ రెవెన్యూ అధికారులు చట్టాలను



భక్షించే విధంగా గిరిజనేతరుడుకు అక్రమ రిసార్ట్ నిర్మాణానికి సహకరిస్తున్నారని గిరిజనులు మండిపడుతున్నారు.గిరిజన చట్టాలు గిరిజనేతరులకు చుట్టాలుగా మారుతున్నాయి అనడానికి ఈ అక్రమ భారీ రిసార్ట్ నిర్మాణమే నిదర్శనమని గిరిజన వాసులు అంటున్నారు. పంచాయతీ కార్యాలయం సమీపంలోనే గిరిజనేతరుడు గిరిజన నేతగా చలామణి దర్జాగా చట్టాలను ధిక్కరించి అక్రమ భారీ రిసార్ట్ నిర్మాణం దర్జాగా చేపడుతున్న అధికారులు పట్టించుకోకపోవడంపై గిరిజనులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గిరిజనేతురుల వద్ద అక్రమ రిసార్ట్ నిర్మాణాల కోసం పంచాయితీ,రెవిన్యూ అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా భారీ స్థాయిలో ఆమ్యామ్యాలు సేకరించి గిరిజన చట్టాలను నీరుగారుస్తున్నారని గిరి ప్రజలు వాపోతున్నారు.గిరిజన చట్టాలను పరిరక్షించడంలో అధికారులు,ప్రజాప్రతినిధులు, పంచాయితీ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే దర్జాగా అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయని ప్రజాసంఘాల నాయకులు సైతం మండిపడుతున్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ టీ నిశాంతి , పాడేరు ఆర్డిఓ లోకేష్ రావు,పాడేరు జిల్లా పంచాయతీ అధికారి అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి అరకులోయ పట్టణంలోని పద్మాపురం మేజర్ పంచాయతీ కార్యాలయం కూతవేటి దూరంలో అక్రమ భారీ రిసార్ట్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని గిరిజనులు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పంచాయితీ రెవెన్యూ కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపట్టక తప్పదని హెచ్చరిస్తున్నారు.



## జీవో నెంబర్ 396 రద్దు చేయాలి

**అనకాపల్లి జయ జయహే**

రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖరులు చేపట్టిన నిరసన దీక్ష శిబిరం మంగళవారం 9వ రోజుకు చేరుకుంది అనకాపల్లి దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అనకాపల్లి తాసిల్దార్, కసింకోట తాసిల్దార్ మునగపాక తాసిల్దార్ కార్యాలయాలకు వెళ్లి నినాదాలు ఇస్తూ ప్లస్ కార్డులు ప్రదర్శిస్తూ తమ నిరసనను తెలియజేస్తూ అక్కడ తహసిల్దారు లకు అధికారులకు ప్రభుత్వం విడుదల చేసిన కొత్త జీవోను 396 రద్దు చేయాలని అంటూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో దస్తాలేఖరులు పాల్గొనడం జరిగింది




## అన్నివర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి.

### డా. పనబాకా లక్ష్మి.

**సత్యవేడు, జులై 28,జయ జయహే**

అన్నివర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం తోనే అభివృద్ధి జరుగుతోందని తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు డా. పన బాక లక్ష్మి అన్నారు.ప్రతి ఇంటికి -- ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అనే మహోన్నత లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ చేపట్టిన "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం సత్యవేడు నియోజకవర్గ పరిధిలోని నాగలాపురం మండలం, కృష్ణపురం పంచాయతీలో మంగళవారం నిర్వహించారు. టీడీపీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ పనబాక లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రతి గడపకు చేర్చడం, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.కార్యక్రమంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువై పనిచేస్తోందని, అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, వార్డు నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డిఎస్సీ అక్రమాలపై వైసిపి నిరసన..

### లోకేష్ రాజీనామా చేయాలి: భరత్ రామ్

**రాజమహేంద్రవరం: జయ జయహే :జూలై 28**

డిఎస్సీ నియామకాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ, నిరుద్యోగ భృతి అమలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ సోమవారం వైసీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.వి.ఎల్‌పురం మార్గాని ఎస్టేట్స్ వద్ద ప్రారంభమైన ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. 'గేమ్ ఓవర్' ఫ్లెక్సీని స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా తాడితోట వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, సిబిఐ విచారణ జరిగే వరకు ఉద్యమం కొనసాగుతుందని అన్నారు. నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేసి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వైసిపి నాయకులపై నమోదవుతున్న కేసులను చట్టపరంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో బిల్డర్ చిన్నా, అరె చిన్ని, గుర్రం గౌతమ్, మార్తి లక్ష్మీ, సంకిస భవానీప్రియ, పోలు విజయలక్ష్మి, దాసి వెంకట్రావు, రొక్కం త్రినాథ్, నల్లా రామాంజనేయులు, మజ్జి అప్పారావు, కాటం రజనీకాంత్, బూడిద శరత్‌కుమార్, ముప్పన శ్రీను, మార్తి నాగేశ్వరరావు, మార్గాని రాము, నందం స్వామి, అందనాపల్లి సత్యనారాయణ, సుభాని, దూర్వాసుల సత్యనారాయణ, సుందర్ సింగ్, గుడాల ఆదిలక్ష్మి, గుడాల ప్రసాద్, గుత్తుల భాస్కర్, సేపేని మునీశ్వరరావు, అనంతలక్ష్మి, వట్టికూటి కృష్ణవేణి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.



## నెలటూరులో మూడు చేపల చెరువులకు వేలం

**చాగల్లు:-( జయ జయహే)**

చాగల్లు మండలం నెలటూరు పంచాయతీ పరిధిలోని మూడు చేపల చెరువులకు ఆగస్టు 4న వేలం వేయనున్నట్లు గ్రామ ప్రత్యేక అధికారి కె.రాజా తిలక్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు.చేపల చెరువుల వేలం పాటలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు నిర్ణీత డిపాజిట్ సొమ్ములను ముందుగా చెల్లించాలన్నారు. దీనిలో లింగాల చెరువు - రూ.2 లక్షలు, గుండాల చెరువు- రూ. లక్ష, తాడి తోట గొయ్యి - రూ.50 వేలు చొప్పున పంచాయతీకి చెల్లించాలన్నారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు స్థానిక పంచాయతీ అభ్యర్థులు అయితే అన్నీ రకాల పన్నులు విధిగా చెల్లించాలని కార్యదర్శి జి.కరుణ తెలిపారు.



## వికృతమాల భూ వివాదాన్ని పరిస్కరించిన ఏర్పేడు మండల తహసీల్దార్

**ఏర్పేడు, జూలై 28, జయ జయహే.**

ఏర్పేడు మండలం వికృతమాల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 311లో ఉన్న 3 ఎకరాల ప్రభుత్వ లీజు పట్టా భూమి వివాదాన్ని తహసీల్దార్ ప రిష్కరించారు.నేరుగా పరిశీలించి హక్కుదారుడికి భరోసా కల్పించిన ఏర్పేడు మండల తహసీల్దార్ చర్యను సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి. మురళి అభినందించారు. మంగళవారం తహసీల్దార్ స్వయంగా వివాదాస్పద భూమిని సందర్శించి, ఇరువర్గాల భూ పత్రాలను పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వం కేటాయించిన భూమి మోరా సాంబయ్య పేరునే ఉందని స్పష్టం చేశారు. ఆ భూమిలో ఇతరులు అక్రమంగా ప్రవేశించడం, హక్కుదారుడి సాగుకు ఆటంకం కలిగించడం చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో సీపీఐ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, సీపీఐ ఏర్పేడు మండల కార్యదర్శి సర్దార్ శివకుమార్, మండల సహాయ కార్యదర్శి, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్. బలరాం, బి.నాగభూషణం, జిల్లా కార్యదర్శి చిన్నం కాలయ్య, తోన్నాటి రమేష్, ఏపీ ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, నాయకులు మించిల శివ కుమార్, ఆర్ శ్రీనివాసులు, కె. రామమూర్తి, నాగరాజు, కృష్ణయ్య, జై భీమ్ నాయకులు పులి శ్రీకాంత్ లు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్న ఏపీ అడిషనల్ సీఈవో

**శ్రీకాళహస్తి, జులై 28,జయ జయహే.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అడిషనల్ సీఈవో, చీఫ్ ఎలక్షన్ కమిషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మంగళవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకోగానే శ్రీకాళహస్తి మండల తహసిల్దార్ టీవీ సుబ్రహ్మణ్యం పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ కాళహస్తీశ్వర దేవస్థానం అధికారులు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అధికారులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.



## విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ.

**శ్రీకాళహస్తి, జులై 28,జయ జయహే.**



రోటరీ క్లబ్ సౌజన్యంతో 130మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్ను, బిస్కెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షురాలు ప్రమీల మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకోవాలని ఆరోగ్యంగా మంచి ఆలోచనతో చిన్న వయసులోనే మంచి అలవాట్లు నేర్చుకోవాలన్నారు. పక్క వారికి సహాయం చేయడం, పొద్దు పొద్దున్నే లేచి తల్లిదండ్రులకు నమస్కరించుకుని స్కూలుకు వచ్చాక గురువుకి నమస్కరించుకోవాలని హితవు పలికారు. ఆదర్శవంతంగా నీతిగా నిజాయితీగా క్రమశిక్షణతో ఆటపాటలతో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో మల్లెమాల ప్రమీలతో పాటు సెక్రటరీ మేగీ క్లారా, కండ్రిగ ఉమా, జనార్ధన్, కృష్ణ కుమార్, సదాశివన్న , ప్రమీల, తరుణ్ హెడ్మాస్టరు హరినాథ్ లు పాల్గొన్నారు.



## ఇంటింటికి టీడీపీ కార్యక్రమం లో పాల్గొన్న రెడ్డివారి గురువారెడ్డి

ఏర్పేడు, జులై 28,జయ జయహే. మండలంలోని ఏర్పేడు లో ప్రజల నమ్మకం అభివృద్ధి సంక్షేమం అనే అంశాలపై ఇంటింటి ప్రచారం కార్యక్రమం లోఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి పాల్గొన్నారు. మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.కార్యక్రమం లో పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణవేణి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మునేయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షులు శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోవిడ్ ఫైటర్స్ వైద్య శిబిరానికి విశేష స్పందన

**గుంటూరు (జయ జయహే)**

నగరంలో గత 6 సంవత్సరాలుగా బహుముఖ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న కోవిడ్ ఫైటర్స్ ఈనెల 28వ తేదీన మంగళవారం గుంటూరులోని ఏటి అగ్రహారంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో ఉచిత కంటి, ఎముకలు మరియు కీళ్ల, స్త్రీల ఆరోగ్య పరీక్షలతో పాటు ఉచితంగా మందుల పంపిణీ చేయడం ద్వారా వందలాది పేద రోగులకు ఎంతగానో తోడ్పాటును అందించింది. ఉచిత మెడికల్ క్యాంపులో స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ షమా సుల్తానా, ఎముకల, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ కోటా కార్తీక్, నేత్ర వైద్య నిపుణులు డా॥ కె. భవిత నేతృత్వంలో పేద రోగులకు వైద్య సలహాలు అందించారు. ఉచిత మెడికల్ క్యాంపు ను జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, మానవత చైర్మన్ వి.వి. నాగిరెడ్డి, కార్మెల్ సేవాసదన్ వ్యవస్థాపకులు జాక్ క్షమాకస్, చేయూత ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు టి. ధనుంజయ రెడ్డి సందర్శించి



కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకులు పఠాన్ అల్లా బక్షు మిత్ర బృంద సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఆరోగ్యమే మహాభాగ్యంగా భావించి వ్యాధి ముదిరిన తర్వాత ఆసుపత్రికి వెళ్లడం కన్నా ప్రారంభంలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మానవత చైర్మన్ వి.వి. నాగిరెడ్డి ప్రసంగిస్తూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఎల్లవేళలా కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ కు అండగా నిలుస్తుందని తెలిపారు. కోవిడ్ ఫైటర్స్ మిత్రబృందంతో గత 5



సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందిస్తున్న షేక్ జానీ భాషా ఆటో దురదృష్టవశాత్తు దగ్ధమై వారి కుటుంబశీ తీవ్ర ఇబ్బందులకు గురి కావడాన్ని గమనించిన నేస్తం, షిర్డీ సాయి సేవాసమితి, చేయూత ఫౌండేషన్, సేవా తత్పరులు త్రిపురమల్లు అరుణ్ కుమార్ లతోపాటు మానవత స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చి 80 వేల రూపాయల విరాళాలను సేకరించి నూతన ఆటో కొనుగోలుకు దోహదపడ్డారు. ఈ సందర్భంగా నూతన ఆటోను అతిథులందరూ ప్రారంభించి కోవిడ్ ఫైటర్స్ సభ్యులకు నైతిక బలాన్ని చేకూర్చారు.

# సింహగిరి ప్రదక్షిణలో పట్టా ఫౌండేషన్ సేవలు





**విశాఖపట్నం జయ జయహే**

విశాఖపట్నం, మంగళవారం:ఆషాఢ మాసం తొలి పౌర్ణమిని పురస్కరించుకొని సనాతన హైందవ సంప్రదాయంలో అత్యంత విశిష్టంగా నిర్వహించబడే సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి సింహగిరి ప్రదక్షిణ సందర్భంగా విశాఖపట్నం జిల్లా పట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశేష సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య ఆశీస్సులతో "మానవ సేవయే మాధవ సేవ" అనే మహా సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిస్తూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్న అశేష భక్తులకు మంగళవారం ఉదయం 10 గంటల నుండి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు నిరంతరంగా ఉచిత సేవలు అందించారు.ఈ సందర్భంగా వేలాది మంది భక్తులకు వివిధ రకాల ఫలహారాలు, శీతల పానీయాలు, చల్లని మజ్జిగ, వెజిటేబుల్ బిర్యానీ, సాయంత్రం స్వీట్ ప్రసాదం, బిస్కెట్లు, ఆరోగ్యానికి అనుకూలమైన టాబ్లెట్లు, మిరియాల పాలు వంటి అనేక పదార్థాలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సమయానికి తగిన విధంగా సేవలు అందించడంలో వాలంటీర్లు విశేషంగా కృషి చేశారు.లగత తొమ్మిది సంవత్సరాలుగా ఎటువంటి విరామం లేకుండా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భక్తుల మనస్సుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన ఆధ్యాత్మిక సేవా సంస్థగా పట్టా ఫౌండేషన్ నిలిచింది. ప్రతి ఏడాది సేవల విస్తృతిని పెంచుకుంటూ మరింత మంది భక్తులకు సేవలు అందించడం సంస్థ యొక్క ముఖ్య లక్ష్యంగా కొనసాగుతోంది.ఇప్పటి సమాజంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని ఈసారి ప్రత్యేకంగా ప్లాస్టిక్ గ్లాసుల వినియోగాన్ని తగ్గించే దిశగా వినూత్న కార్యక్రమం చేపట్టారు. బిస్కెట్ గ్లాసుల ద్వారా భక్తులకు మిరియాల పాలు అందిస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమం భక్తుల నుండి మంచి స్పందనను పొందింది.ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పట్టా రమేష్ బాబు మాట్లాడుతూ, "సేవే పరమోద్దేశం" అనే భావనతో ప్రతి ఏడాది మరింత విస్తృతంగా సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టా ఫౌండేషన్ ట్రస్టీలు బొడ్డెడ వెంకటలక్ష్మి, ఆర్. భాస్కర్ భారతి, దొడ్డి రమేష్, సభ్యులు పెంటకోట శ్రీదేవి, భీశెట్టి అఖిల, పెంటకోట నూకరాజు లక్ష్మి, డి. శ్యామల, సరోజిని, రాజేష్, హర్ష వర్షిణి, పూర్ణ చందు, పట్టా రవి, అలీ, పెంటకోట కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ పట్టా ఫౌండేషన్‌కు తమ ఆశీర్వాదాలు అందజేశారు.



## టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి.... టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్

**శ్రీకాళహస్తి జూలై 28, జయ జయహే:**

స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సూచనల మేరకు, టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలోని 6, 9 ఇంటింటా ప్రచారం క్లస్టర్ ఇంచార్జ్ బాలాజీ రెడ్డితో కలిసి నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి, పథకాల వివరాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకు వెళుతోందని తెలిపారు. టిడిపి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటింటి చేరుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమానికి వార్డ్ ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ పేట బాలాజీ రెడ్డి, యూనిట్ ఇంచార్జ్ వెంకటేశ్వర చౌదరి, మునిరాజ యాదవ్, టిడిపి నాయకులు తీర్థం వెంకటేశ్వర్లు, దారా పాండు, కుమారి, చంద్ర, శ్రీనివాసులు, వరుణ్ కుమార్ రామచంద్రయ్య రమేష్ టిడిపి కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జిల్లా జడ్జిగా ఎంపికైన నాగప్రసన్నకు సత్కారం

**చోడవరం జులై 28 జయ జయహే**

చోడవరం అంబేద్కర్ భవన్లో అంబేద్కర్ ట్రస్ట్ చైర్మన్, వ్యవస్థాపకులు నడిపూరి సన్యాసిరావు కుమార్తె నడి పూరి నాగ ప్రసన్న భారతి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో నూతనంగా ఎంపికైన జిల్లా జడ్జి లలో ఒకరుగా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం చోడవరం అంబేద్కర్ ట్రస్ట్ నిర్వాహకులు నాగ ప్రసన్న భారతి ని ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధి నడుపూరు దేవుడు మాస్టారు మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన జడ్జి కి శుభాకాంక్షలు తెలియజేస్తూ సకాలంలో న్యాయం అందేటట్లు వృత్తి పట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కండెల వెంకట్రావు మాస్టారు మాట్లాడుతూ చోడవరం ప్రాంతానికి చెందిన తొలి మహిళ న్యాయమూర్తిగా ఈ ప్రాంతానికి గర్వకారణంగా చెప్పుకోవచ్చని పేదలకు బడుగు బలహీన వర్గాలకు అన్నివర్గాలకు సకాలంలో న్యాయం జరిగేటట్లు చూడాలని కోరారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఎర్రం శెట్టి వరప్రసాద్, జుంజుర అప్పారావు మాస్టారు, న్యాయవాది భూపతి రాజు, వేచలపు ప్రకాష్ తదితరులు పాల్గొని నూతనంగా ఎంపికైన జిల్లా జడ్జి కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగ ప్రసన్న భారతి మాట్లాడుతూ మా నాన్న తో పాటు ఇంకా అనేకమంది ఉన్నతమైన న్యాయమూర్తులు కలిగి ఉన్న ఈ దేశంలో వారి ఆదర్శంగా తీసుకొని పనిచేస్తానని సకాలంలో న్యాయం జరిగేటట్టు కృషి చేస్తానని తెలియజేశారు.



## ఈవీఎంలను తనిఖీ చేసిన కలెక్టర్ విజయకృష్ణన్

**అనకాపల్లి జయ జయహే**

2024 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉపయోగించిన ఈవీఎం లను ఎన్నికల అనంతరం అనకాపల్లి ఎస్పీ ఆఫీస్ పక్కన స్టోర్ రూమ్ లో భద్రపరిచిన ఈవీఎం లను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో పరిశీలించడం జరిగింది. అనంతరం కలెక్టర్ ఆఫీస్ కార్యాలయం నందు డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ రోల్స్ పై సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా ఇటీవల జరిగిన సర్ వెరిఫికేషన్ వివరాలపై అనకాపల్లి పార్లమెంటు పరిధిలో 13,02,389 ఓటర్లకు బి ఎల్ ఓ లు డిస్ట్రిబ్యూషన్ చేశారు అందులో 11, 93,053 మంది ఓటర్లు నమోదు అయ్యారు ఇందులో1,09,336 ఓటర్లు నమోదు కాలేదని అలాగే డబల్ ఎంట్రీ అయినవారు మరణించిన వారు ఇతర ప్రదేశాల్లో ఉండి నమోదు చేసుకోలేని వాళ్ళు అలానే ఏమైనా అభ్యంతరాలు ఉన్నవాళ్లు మరియు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్ నమోదుపై జూలై 31వ తేదీ నుండి ఆగస్టు 30వ తేదీ వరకు నమోదు చేసుకోవడానికి మీ ప్రాంత బిఎల్వోలకు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు ఏవైనా అభ్యంతరాలను ఉంటే పరిశీలించి ఫైనల్ ఓటర్ లిస్టు 03/10/26 ఎలక్ట్రానిక్ రోల్ తుది జాబితా రెడీ అవుతుందని అధికారులు పేర్కొన్నారు వీటన్నిటి పైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండే విధంగా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని అధికారులు పేర్కొన్నారు అనకాపల్లి జిల్లా పరిధిలో 1 529 పోలింగ్ కేంద్రాలు ఉండగా అదనంగా 107 పోలింగ్ కేంద్రాలు గుర్తించడం జరిగిందని ఆ వివరాలు అనకాపల్లి 24 ఎలమంచిలి 20 పాయకరావుపేట 20 నర్సీపట్నం 11 చోడవరం 29 మాడుగుల 3 ఈ పోలింగ్ కేంద్రాలు జాబితాలు సీఈఓ ఆఫీస్ కి అనుమతికి పంపడం జరిగిందని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులు ప్రభుత్వ అధికారులు పాల్గొనడం జరిగింది



## ప్రజలకు అందుబాటులో ప్రజా పాలన

**మాడుగుల జులై 28 జయ జయహే**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా పాలన అందిస్తుందని మాడుగుల మార్కెట్ కమిటీ చైర్మన్ పి అప్పలరాజు చెప్పారు. తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం లో భాగంగా మంగళవారం పార్టీ కార్యకర్తలతో ఇంటింటికి వెళ్లి రెండేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని రానున్న రోజుల్లో మరి జా అభివృద్ధి చూస్తామని చెప్పారు. ఈ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరు ఆశీర్వదించి స్వాగతించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ, సహకార సంఘ అధ్యక్షుడు కొట్నాల త్రినాధరావు, పార్టీ ప్రతినిధులు మూర్తి, నానాజీ ,వరప్రసాద్, సూరిబాబు, బాలు తదితరులు పాల్గొన్నారు.




### శివాలయ పుష్కరిణి
## అభివృద్ధికి 50 వేలు విరాళం

**చోడవరం జూలై 28 జయ జయహే**

చోడవరంలో అతి ప్రాచీన శ్రీ గౌరీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల పుష్కరిణి పునర్నిర్మాణ పనులకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ కొయ్య విజయలక్ష్మి ఉపాధ్యాయుల సహకారంతో 50 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ యన్ ఎస్ రాజు చేతుల మీదుగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాధ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్ దుర్గాప్రసాద్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం మహాలక్ష్మి నాయుడు సమక్షంలో ఆలయ చైర్మన్ గునూర్ సురేష్ శివాలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతిరావు కి అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మిని ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు.

## మాడుగులలో రేపు మెగా జాబ్ మేళా

**మాడుగుల జూలై 28 జయ జయహే**



ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఒక సువర్ణావకాశం ప్రభుత్వం కల్పిస్తుందని దాన్ని సద్వినియోపరుచుకోవాలని మాడుగుల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మి నారాయణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 30న మాడుగుల.ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మాడుగుల మండలంలో గల నిరుద్యోగ యువతీ యువకులు అందరూ ఈ అవకాశాన్ని సబినియోగపరచుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాలో సుమారు 15 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు.10వ తరగతి,ఐటీఐ డిప్లొమా,డిగ్రీ అర్హత కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరైనప్పుడు వారి విద్యార్హతల సర్టిఫికెట్ల- ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలన్నారు. అయితే అభ్యర్థులు ముందుగానే తమ పేర్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. నైపుణ్యం. ఏపీ. జీవో వి. ఐ ఎన్ వెబ్సైట్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి హాజరవుతారు అన్నారు. కాబట్టి అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తప్పకుండా హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు.




## గిరిజన యువత నైపుణ్యాభివృద్ధి, సీటీయూఏపీ--ఐకార్-నార్మ్ సహకారం

**హైదరాబాద్, జూలై 28, (జయ జయహే)**

గిరిజన యువత నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయ ఆవిష్కరణలు, పరిశోధన, ఉపాధి అవకాశాల విస్తరణ లక్ష్యంగా సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఐకార్--నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్), హైదరాబాద్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చించింది. ఈ సందర్భంగా సీటీయూఏపీ ఇన్‌చార్జి వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్, వృక్షశాస్త్ర విభాగాధిపతి డా. అనిరుధ్ కుమార్, నార్మ్ డైరెక్టర్ డా. ఆర్.ఎం. సుందరంతో సమావేశమయ్యారు. గిరిజన యువతలో నైపుణ్యాలు, వ్యవసాయ ఆధారిత వ్యవస్థాపకత పెంపొందించడం, అగ్రి-బిజినెస్ ఇంక్యుబేషన్, గిరిజన ఉత్పత్తులకు విలువ జోడింపు--మార్కెట్ అనుసంధానం, వాతావరణ అనుకూల వ్యవసాయ విధానాలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వ్యవసాయ నిర్వహణ, పరిశోధన, నాయకత్వం తదితర రంగాల్లో సంయుక్త శిక్షణ, మూక్స్ కోర్సుల నిర్వహణపై చర్చించారు. ఈ కార్యక్రమాల అమలుకు ఇరు సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకునే అవకాశాన్ని పరిశీలించారు. తద్వారా గిరిజన ప్రాంతాల్లో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, స్థిరమైన జీవనోపాధి అవకాశాలను బలోపేతం చేయాలని ఇరు సంస్థలు ఆకాంక్షించాయి.

## రోడ్డు ప్రమాదంలో తిరుమల డైరెక్టర్ దుర్మరణం

**రాజమహేంద్రవరం: జయ జయహే , జులై 28:**



హైదరాబాద్ నుంచి రాజమండ్రి వస్తుండగా జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్, అధినేత నున్న తిరుమలరావు సోదరుడు నున్న సురేష్ (52) మృతి చెందారు. ఈ ప్రమాదం బాపులపాడు మండలం బొమ్మలూరు (కల్లపరు) టోల్‌గేట్ సమీపంలో చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో ఆయన సతీమణి విమలదేవి తీవ్రంగా గాయపడగా, చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. నున్న సురేష్ మృతి వార్త విద్యారంగంతో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. పలువురు విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్నారు

# అలసిన పాదాలకు ఉపశమనం కల్పించిన శ్రీ సత్యసాయి సేవాదళ్


## గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు నిస్వార్థ సేవలందించిన శ్రీ సత్యసాయి సేవా సంస్థలు

**విశాఖపట్నం, జూలై 28, జయ జయహే :**

పవిత్రమైన గురుపూర్ణిమ సందర్భంగా సింహాచల క్షేత్ర ఆరాధ్యదైవం, కోట్లాది మంది భక్తుల ఇలవేల్పు శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న లక్షలాది మంది భక్తులకు విశాఖ జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థలు విస్తృతమైన సేవా కార్యక్రమాలను ప్రేమతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించాయి. శ్రీ సత్యసాయి సేవా సంస్థల సింహాచలం సమితి, గోపాలపట్నం భజన మండలి ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణకు విచ్చేసిన భక్తులకు మంగళవారం నుంచే సేవా కార్యక్రమాలు ప్రారంభమై, రాత్రంతా కొనసాగి బుధవారం ఉదయం వరకు నిర్వహించారు. ఎంతో దూరం నడిచి అలసిపోయిన భక్తుల పాదాలకు ఉపశమనం కల్పించేందుకు శ్రీ సత్యసాయి సేవా సంస్థలు చేపట్టిన ప్రత్యేక పాద మర్దన సేవ అందరి హృదయాలను స్పృశించింది. భక్తుల పాదాల కోసం నువ్వుల నూనెలో ప్రత్యేక వనమూలికలను మరిగించి తయారుచేసిన నూనెను శ్రీ సత్యసాయి సేవా సంస్థలు ప్రత్యేకంగా సిద్ధం చేయించాయి. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి అపారమైన కృప, ఆశీస్సులతో, విశాఖ జిల్లా శ్రీ



సత్యసాయి సేవా సంస్థలకు చెందిన సేవాదళ్ సభ్యులు, భక్తులు గిరి ప్రదక్షిణ మార్గంలోని సీతమ్మధార, ఆరిలోవ, ఎంవీపీ కాలనీ, సాగర్ నగర్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, మాధవధార, మురళీనగర్, సింహగిరి కాలనీ, సింహాచలం, గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెంలోని సుసర్ల కాలనీ తదితర ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అల్పాహారం, ఉడికించిన సెనగలు, పులిహోర, మజ్జిగ, బిస్కట్లు, టీతో పాటు శారీరక ఉపశమనం కోసం అమృతాంజనం కూడా ప్రేమతో అందించారు. ఈ ప్రత్యేక గిరి ప్రదక్షిణ సేవా కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర జాయింట్ సేవా సమన్వయకర్త డి. రాఘవరావు, విశాఖ జిల్లా సేవా సమన్వయకర్త ఆర్.ఏ. నాయుడు, శ్రీ సత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు వి.ఆర్. నాగేశ్వరరావు, జిల్లా జాయింట్ స్పిరిచ్యువల్ కోఆర్డినేటర్ జి.ఎన్. మూర్తి, సమితి కన్వీనర్లు బి. సాయికుమార్, జగదీశ్, రాజీవ్ లోచన, హరిహరరావు, ప్రసాద్, గోపాలపట్నం భజన మండలి కన్వీనర్ ఎస్. జగదీశ్ తదితరులు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



## కన్నుల పండుగగా ఆధ్యాత్మికంగా నరసింహా స్వామికి జరిగిన నగర ప్రదక్షణ

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక గవరపాలెం దెబ్బ వీధిలో నెలకొల్పబడి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి పురవీధుల నగర ప్రదక్షిణ కార్యక్రమం భక్తజనులు మంగళవారం సాయంత్రం కన్నుల పండుగ ఆధ్యాత్మిక భక్తి భావంతో నిర్వహించడం జరిగింది. స్థానికులు సింహాచలం గిరి ప్రదర్శనకి వల్ల లేని వాళ్ళు ఇక్కడ అనకాపల్లిలో ఉన్న నరసింహ స్వామిని రథంలో ఉత్సవ విగ్రహాలు పెట్టి పురవీధుల్లో ఊరేగిస్తూ నగర ప్రదక్షణ చేయడం జరిగింది ఈ నగర ప్రదక్షిణ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో సుమారు 4000 మంది మహిళలు పాల్గొనడం జరిగింది . ఈ ఊరేగింపు ప్రదక్షణ కార్యక్రమం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రామ్కి పాల్గొని ప్రారంభించడం జరిగింది దారి పొడుగునా భక్తులు గోవిందా గోవిందా లక్ష్మీ నరసింహ స్వామి గోవిందా అంటూ నినాదాలు ఇస్తూ భక్తులు తరలిరావడం జరిగింది రథంలో ఊరేగుతున్న స్వామివారికి చుట్టుపక్కల స్థానికులు మంగళ హారతులు ఇచ్చే స్వాగతం పలకడం జరిగింది . ఈ ఊరేగింపు సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు భక్తులు, భక్త జనంతో కోలాహలంతో రోడ్లు కిక్రిసి పోయాయి అలాగే దారి పడున స్వచ్ఛంద సంస్థలు మంచినీళ్లు బాటిల్ డ్రింక్ బాటిల్ పులిహార నగర ప్రదక్షణలో పాల్గొన్న భక్తులకు అందజేయడం జరిగింది



## వ్యభిచారం గృహంపై ఆకస్మిక దాడి

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జిల్లా పోలీస్ ఎస్పీ తుహిన్ సిన్హా వారి ఆదేశాల మేరకు అనకాపల్లి డి.ఎస్.పి ఆర్ఆర్ మోహన్ వారి పర్యవేక్షణలో స్థానిక కసింకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆళ్ల స్వామి నాయుడు వారికి వచ్చిన సమాచారం మేరకు నూతన గుంట పాలెం గ్రామంలో నిర్వహిస్తున్న వ్యభిచారం గృహంపై పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు ఈ దాడిలో కసింకోట ఎస్సై కె లక్ష్మణరావు పోలీస్ సిబ్బంది పాల్గొని నూతన గుంట పాలెం గ్రామానికి చెందిన గొంతున భూలోక మరియు కాసిం దేవి నాగమణి తమ నివాసంలో వ్యభిచారం నిర్వహిస్తూ మహిళలను ప్రలోభ పెట్టి ఈ వ్యభిచార రొంపిలోకి దింపి వారి చేత బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నట్లు పోలీసులు విచారణలో గుర్తించారు ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఇద్దరు మహిళలును రక్షించి, ఈ నేరానికి సంబంధించిన మూడు మొబైల్ ఫోన్లు మరియు ఇతర నేరా సంబంధిత వస్తువులను స్వాధీనం చేసుకోవడం జరిగింది వ్యభిచారం నిర్వహిస్తున్న ప్రోత్సహిస్తున్న ఇద్దరు నిందితులను కసింకోట పోలీసులు వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు ఇటువంటి అశాంగిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఇటువంటి తప్పుడు పనులు జరుగుతున్నట్లు ఎవరికైనా తెలిసిన తమకు సమాచారం ఇవ్వాలని కసింకోట పోలీసులు విజ్ఞప్తి చేశారు



## మాజీ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డితో పెంద్ర వీరన్న భేటీ

**తాడేపల్లి (జయ జయహే)**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ని. వైఎస్సార్‌సిపి ఎం.బి.సి విభాగం రాష్ట్ర అధ్యక్షులు, పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, ఎం.బి.సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు, అత్యంత వెనుకబడిన వర్గాల సంక్షేమం మరియు పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలతో పాటు పలు కీలక అంశాలపై వారి మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా పెంద్ర వీరన్న మాట్లాడుతూ: "వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉందాని, వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ఎం.బి.సి వర్గాలకు తగిన గుర్తింపు లభించిందని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ పిలుపు మేరకు ఎం.బి.సి విభాగం తరఫున ప్రజా క్షేత్రంలో చురుగ్గా పనిచేసి, పార్టీ బలోపేతానికి శ్రమిస్తామని" ఆయన పేర్కొన్నారు.

# గిరిజన గ్రామంలోమంత్రులు అనిత, సంధ్యారాణి పర్యటన




గిరిజనులతో కలిసి దింసా నృత్యం



**అల్లూరి జిల్లా,పాడేరు జులై 28: (జయ జయహే)**

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం డల్లాపల్లి పంచాయతీ పరిధిలోని మారుమూల గిరిజన గ్రామం సప్పిపుట్టులో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పర్యటించారు. ఎత్తైన కొండల మధ్య సుమారు ఎనిమిది కిలోమీటర్లు ప్రయాణించి గ్రామానికి చేరుకున్న మంత్రులకు స్థానిక గిరిజనులు సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. గ్రామ పర్యటనలో భాగంగా గిరిజన మహిళలతో కలిసి మంత్రులు దింసా నృత్యంలో పాల్గొని వారితో మమేకమయ్యారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. అలాగే ఆవకాడో, సీతాఫలం మొక్కలు, రాజ్మా విత్తనాలను గిరిజన రైతులకు పంపిణీ చేసి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈగల్ బృందం ఆధ్వర్యంలో గిరిజనులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ సహకారంతో గంజాయి సాగును విడిచిపెట్టి ప్రత్యామ్నాయ పంటల సాగు చేపడుతున్నామని గిరిజనులు తెలిపారు. ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, సప్పిపుట్టు గ్రామం ఎంతో అందంగా ఉందని, ఈ గ్రామానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. గిరిజనులు గంజాయి సాగును వదిలి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అడుగులు వేయడం అభినందనీయమన్నారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని చెప్పారు. ప్రజల్లో భరోసా కల్పించడానికే ఇక్కడికి వచ్చామని, ఎన్డీఏ ప్రభుత్వం గంజాయి సాగుపై ఉక్కుపాదం మోపిందన్నారు. ఈగల్ బృందం గిరిజన గ్రామాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మంచి మార్పుకు దోహదపడుతోందని పేర్కొన్నారు.



## కాకరపాడులో ఘోర రోడ్డు ప్రమాదం

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ జులై 29,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం, కాకరపాడు గ్రామ సమీపం, రాజోమ్మంగి వెళ్లే ప్రధాన రహదారి లో మంగళవారం మధ్యాహ్నంలైలెండ్ వాహనం, బోలేరో పికప్ వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం లో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు మరికొందరికి గాయాలు అయ్యాయి. క్షత గాత్రులను అంబులెన్సు లో రాజేంద్రపాలెం పీహెచ్ కి తరలించారు. స్థానికులు వెంటనే యాక్సిడెంట్ గురించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు అతివేగమే కారణమని అంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంటింటా సంక్షేమ పథకాలు

**పాంగి భగత్ రామ్**

**అరకులోయ: జూలై 28, జయ జయహే.**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్ల కాలంలో ఇంటిలోనూ సంక్షేమ పలాలు అందాయని అరకు వేలి మండలం చిన్నలబుడు పంచాయితీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాంగి భగత్ రామ్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు. విజయనగరం ఆర్టిసి జోనల్ చైర్మన్ అరకు టిడిపి ఇన్చార్జ్ సియ్యారి దొన్ను దొర ఆదేశాల మేరకు. హట్టగూడ గ్రామంలోని తెలుగుదేశం పార్టీ చిన్నలబుడు పంచాయితీ అధ్యక్షులు పాంగి భగత్ రామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ అభివృద్ధి పలాలను వివరించారు. డోర్ టు డోర్ ఇంటింటా వెళ్లి వారి వారి కుటుంబాలకు ఏ స్థాయిలో మేలు జరిగిందన్న విషయాలపై ప్రజాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. రెండేళ్ల పాలనలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అన్నదాత సుఖీభవ తల్లికి వందనం శ్రీ శక్తి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచిత మెగా డీఎస్సీ రాజముద్ర తో పట్టదరుల పాస్ పుస్తకాలు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు గృహాలు అన్న క్యాంటీన్లు వంటి పథకాలు ద్వారా ప్రతి ఇంట్లోనూ మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్ల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

**విజయనగరం జూలై 28 (జయ జయహే )**



తిరుమల మెడికవర్ ఆసుపత్రిలో మంగళవారం ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ రెడ్డి దుర్గ సాయి కుమార్ మాట్లాడుతూ, ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని 2008 నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెపటైటిస్ బి వైరస్‌ను కనుగొన్న అమెరికన్ శాస్త్రవేత్త డాక్టర్ బారుచ్ శామ్యూయెల్ బ్లుంబర్గ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జూలై 28న ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. హెపటైటిస్ బి, సి వ్యాధులపై ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఈ వ్యాధులకు సమర్థవంతమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ముందస్తుగా పరీక్షలు చేయించుకుని వ్యాధిని గుర్తిస్తే మందులతో నియంత్రించవచ్చని వివరించారు. వ్యాధిని ఆలస్యంగా గుర్తించడం వల్ల కొందరు లివర్ సిరోసిస్, లివర్ క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 70 మందికి ఉచితంగా హెపటైటిస్ పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.



## శాసనసభ పిటిషన్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కొణతాల

**అనకాపల్లి జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్ల కమిటీ సమావేశం మంగళవారం విజయవాడలో జరిగింది శాసనసభ డిప్యూటీ స్పీకర్ మరియు పిటిషన్ కమిటీ చైర్మన్ కే రఘురామకృష్ణంరాజు వారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ పాల్గొనడం జరిగింది ఈ సమావేశంలో ప్రజల నుంచి అందిన వివిధ ఆర్జీలు దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ప్రజా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ప్రజా సమస్యలను నిర్దిష్ట కాల పరిమితులొ పరిష్కరించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిటీ చైర్మన్ ఆదేశించడం జరిగింది . అదే విధంగా వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు ప్రజలకు అందిస్తున్న సేవలు పెండింగ్ లో ఉన్న అంశాలపై కూడా సమీక్ష నిర్వహించి పాలనలో మరింత సమర్ధత పారదర్శకత తీసుకురావాలని అధికారులకు సూచించారు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని వారు పేర్కొన్నారు ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీ పై సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కారం చర్యలు చేపట్టాలని కమిటీ స్పష్టం చేసింది

# వైభవంగా సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం

- అప్పన్న నామస్మరణతో కిటకిటలాడుతున్న మార్గం
- లక్షలాది మంది పాల్గొంటారని అధికారులు అంచనా
- భక్తుల కోసం భారీ ఏర్పాట్లు.. డ్రోన్లతో పోలీసుల పర్యవేక్షణ
- దారి పొడవునా స్వచ్ఛంద సంస్థల సేవలు

**విశాఖపట్నం, జూలై 28, జయ జయహే :**



ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులతో 32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడుతోంది. కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది 10 లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పాదయాత్ర చేస్తున్న భక్తుల కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో 33 చోట్ల వైద్య శిబిరాలు, 26 అంబులెన్స్‌లను అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న వారికి అప్పన్న ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. మార్గమధ్యలో పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. 32 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని భక్తులు బుధవారం ఉదయానికి స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. ఆషాఢ పౌర్ణమి నాడు సింహాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. శ్రీ వరహా లక్ష్మీనృసింహస్వామి కొలువైన సింహగిరి ప్రదక్షిణ మంగళవారం ప్రారంభం కానున్నది. తొలిపావంచా వద్ద స్వామివారి పుష్పతేరు (ప్రచార రథం)ను దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు లాంఛనంగా ప్రారంబించారు. అనంతరం భక్తులు గోవింద నామస్మరణతో గిరి ప్రదక్షిణకు ఉపక్రమించారు. దారి పొడవున ప్రతి 500 మీటర్లకు ఒకటి చొప్పున 596 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటుచేశారు. వాటి నిర్వహణకు, నీటి సరఫరాకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. అలాగే తాగునీటికి 115 కేంద్రాలు పెట్టారు. భక్తుల కోసం 28 సహాయక కేంద్రాలు, ఏడు కంట్రోల్ రూమ్‌లు పెట్టారు. 22 అంబులెన్స్‌లు, 31 వైద్య సహాయక బృందాలను అందుబాటులో ఉంచారు. తొలిపావంచా వద్దకు వెళ్లడానికి 50 క్యూలైన్లు, కొబ్బరికాయలు కొట్టడానికి 120 ఐరన్ స్టాండ్లు పెట్టారు. గిరి ప్రదక్షిణ పూర్తయ్యాక స్వామి వారిని దర్శించుకునే వారి కోసం ఆర్టీసీ 50 బస్సులను కొండపైకి నడుపుతుంది. పిల్లలు, వృద్ధులు ఎవరైనా తప్పిపోతే మైకుల్లో చెప్పడానికి 40 పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌లు పెట్టారు. పిల్లలు, పెద్దలను ముందుగానే గుర్తించి వారి చేతికి రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిటీ ట్యాగ్‌లు వేస్తారు. వారు తప్పిపోయినట్టయితే ఎక్కడున్నారో ట్యాగ్‌ల ద్వారా గుర్తించగలుగుతారు. గిరి ప్రదక్షిణ విధులకు దేవస్థానం, జీవీఎంసీ, రెవెన్యూ నుంచి 100 మంది అధికారులు, 500 మంది సిబ్బంది, 200 మంది సచివాలయ సిబ్బంది, 270 మంది సెక్యూరిటీ గార్డులు, 1,750 మంది వలంటీర్లు, రెండు వేల మంది పారిశుద్ధ్య సిబ్బందిని కేటాయించారు. వీరు కాకుండా పోలీస్ శాఖ నుంచి సుమారు ఐదు వేల మంది అందుబాటులో ఉంటారు. బుధవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి కొండపై ఆలయ ప్రదక్షిణకు అనుమతిస్తారు. రాజగోపురం బయటే ఈ ప్రదక్షిణ పూర్తిచేసుకోవాలి. మంగళవారం సుమారు 50 వేల మంది, బుధవారం 80 వేల మంది భక్తులు స్వామిని దర్శనం చేసుకుంటారని అంచనా వేసి అందుకు తగిన ఏర్పాట్లు చేశారు.



## అప్పన్న భక్తులకు గిరి ప్రదక్షిణలో రోటరీ సేవలు

**విశాఖపట్నం, జూలై 28, జయ జయహే**

సింహాచల గిరి ప్రదక్షిణలో రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ అందించిన సేవలు పలువురి ప్రశంసలు పొందాయి. నరసింహ నగర్ లో ఏర్పాటుచేసిన ప్రత్యేకమైన శిబిరంలో వేలాది మంది భక్తులకు వైద్య సేవలు అందజేశారు. సుమారు 50 మంది వైద్య సిబ్బంది తో మూడు బృందాలుగా ఏర్పడి వైద్య సేవలు అందజేశారు. సాయంత్రం నాలుగు గంటల నుండి నిర్విరామంగా మందుల పంపిణీ చేశారు. కాళ్ల నొప్పులతో ఇబ్బంది పడే భక్తులకు తైల మర్దన చేసి తక్షణ ఉపశమనం కలిగించారు. కాళ్లకు గాయాలు తగిలి నడవలేని పరిస్థితిలో పలువురికి ప్రథమ చికిత్స అందించి తిరిగి వారి పాదయాత్రను కొనసాగించేందుకు సహకరించారు. రోటరీ క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సిహెచ్ కిషోర్ కుమార్ శిబిరాన్ని సందర్శించి క్లబ్బు సభ్యులను అభినందించారు. అయ్యప్ప అన్న సమారాధన సేవా ట్రస్ట్ వారు భక్తులకు అల్పాహారాన్ని, పానీయాలని పంపిణీ చేశారు. వి హెల్త్ కేర్, డి.డి.ఆర్. ఇన్స్టిట్యూషన్స్ పలువురు రొటేరియన్లు ఈ శిబిర నిర్వహణకు సహకరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ కామేశ్వరరావు, కె.ఎం.కె. రమేష్, కమ్యూనిటీ సర్వీసెస్ మెడికల్ డాక్టర్ అశోక్ దేవరకొండ, ఫిజియోథెరపిస్టులు డాక్టర్ పర్వీన్, డాక్టర్ రమేష్ సేవలు అందజేశారు. పలువురు రొటేరియన్లు పాల్గొని తమ సహకారాన్ని అందజేశారు.




## గిరిప్రదక్షిణ భక్తులకు కె కె రాజు ప్రసాద వితరణ

**విశాఖపట్నం (జయ జయహే)**

సింహాచలం శ్రీశ్రీశ్రీ వరహా లక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణ సందర్భంగా సిరి వెంకటేశ్వర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, వైయస్సార్సీపి విశాఖ జిల్లా అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె కె రాజు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశాను.. ఈ సందర్భంగా, చక్కర పొంగలి, టమాటా బాత్ ఉప్మా , కొమ్ము శనగలు, కరివేపాకు రైస్, ఫ్రూటీ , బిస్కెట్ ప్యాకెట్లు అందజేసారు. ఈ కార్యక్రమంలో విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, గాజువాక నియోజవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, 14 వ వార్డు మాజీ కార్పొరేటర్ కటారి అనిల్ కుమార్ రాజు మరియు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు

## శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి దంపతులు

**తిరుపతి (జయ జయహే)**



తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి నీ మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైఎస్ఆర్సీపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఆశాడ పౌర్ణమి రోజున శ్రీవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్ర రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో మంచి పరిపాలన అందాలని శ్రీవారిని కోరారు. సింహాచలం నృసింహ స్వామి గిరిప్రదక్షణ లో లక్షలాదిమంది నడిచే భక్తుల సంకల్పం విజయవంతం కావాలన్నారు. 2029 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రావాలని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు తమ అధినేత జగనన్న పై చల్లగా ఉండాలని వాసుపల్లి గణేష్ కుమార్ ఆకాంక్షించారు. తిరుమల అభివృద్ధికి వైసిపి హయాంలో ప్రతిష్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. మళ్లీ స్వామివారి ఆశీస్సులతో వచ్చే వైసీపీ ప్రభుత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానం అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు.



## ఇంటింటికి తెలుగుయువత

**పాడేరు (జయ జయహే)**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం మంగళవారం పాడేరు మండలం ముంచింగిపుట్టు పంచాయతీ పాతరపుట్టు గ్రామంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్ ఇంటింటికి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ప్రజలకు అందుతున్న సంక్షేమశీ తల్లికివందనం, రైతు భరోసా, ఎన్ టీ ఆర్ పింఛను భరోసా, ఏడాదికి ఉచిత గ్యాస్, ఉద్యోగాలు నియామకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం చక్కగా నిర్వహిస్తుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ తామర మూర్తిబాబు, జగశీదొర చంటిబాబు, అప్పారావు, మాతే అర్జున్ తదితరులు పాల్గొన్నారు

## రేపిస్టులను సమర్థించే వ్యక్తికి విద్యాశాఖ

### ప్రహ్లాద్ జోషిపై మండిపడ్డ రాహుల్ గాంధీ

**(జయ జయహే)**



కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ప్రహ్లాద్ జోషి అత్యంత నీచమైన ప్రవర్తన కలిగిన వ్యక్తి అంటూ రాహుల్ మండిపడ్డారు. రేపిస్టులను ఆయన రక్షిస్తున్నారని ఆరోపించారు. మంగళవారం పార్లమెంట్ బయట రాహుల్ గాంధీ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ మాట్లాడుతూ.. 'యువత విద్యా వ్యవస్థపై నిరసనలు తెలుపుతోంది. చాలా మంది అమ్మాయిలు ఆందోళనలు చేస్తున్నారు. పోలీసులు వారిపై లాఠీఛార్జ్ చేశారు. అంతటితో ఆగకుండా.. రేపిస్టులను సమర్థించే ఓ వ్యక్తిని బీజేపీ విద్యాశాఖ మంత్రిని చేసింది. ఆయన అత్యంత నీచమైన వ్యక్తి. రేపిస్టులకు రక్షణ కావాలని చెప్పే వ్యక్తి కంటే మించిన నీచమైన వ్యక్తి మరొకరు ఉండరు. అలాంటి వ్యక్తి భారతదేశ విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు' అని వ్యాఖ్యానించారు. బిల్కిస్ బానో గ్యాంగ్‌రేప్ కేసులో దోషుల శిక్షా కాలాన్ని తగ్గించి, విడుదల చేయడాన్ని గతంలో ప్రహ్లాద్ జోషి సమర్థిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ రాహుల్ ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# నగరంలో భారీ వర్షం

## లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం... ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

**(జయ జయహే)**




గ్రేటర్ హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం కురవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హైడ్రా, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ మాన్సూన్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. కుండపోత వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, నాంపల్లి, కోఠి, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట, ఎల్బీ నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అదే సమయంలో బేగంపేట్, సికింద్రాబాద్, మణికొండ, గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, కొంపల్లి, ఓల్డ్ సిటీ, అంబర్‌పేట్, కాచిగూడ ప్రాంతాల్లోనూ కుండపోత వర్షం పడటంతో రహదారులపై భారీగా నీరు నిలిచింది. పలుచోట్ల వాహనాలు ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించి, ఉద్యోగులు, ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు వీచడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడటంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని హైడ్రా, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, జీహెచ్ఎంసీ మాన్సూన్ ఎమ్జర్గ÷న్సీ బృందాలు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. నీరు నిలిచిన ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రం చేస్తూ, ట్రాఫిక్‌ను నియంత్రించే చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించగా, వర్షం కొనసాగుతున్న నేపథ్యంలో అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com